# బేల



**అడుగులకు** అనుగుణంగా లయవేసే కాళ్ల గజ్జెల గలగలలతో, తీర్చిదిద్దిన కాటుక కళ్లు చురుగ్గా అటు ఇటు తిప్పుతూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వస్తూన్న నర్మదను చూశాడు కృష్ణ. భ్రుకుటి ముడివడింది కన్నులలో అస్పష్టంగా క్రోధాణువులు ప్రస్ఫుటించాయి విసురుగా వెళ్ళాడు దగ్గిరికి: "ఏం? ఎందుకు వచ్చావు మా ఇంటికి? రానంటే రానని ఒట్టు పెట్టుకున్నావుగా!"

"మీ ఇంటికేం రాలేదు మా అత్తయ్యగారి ఇంటికి వచ్చాను" చమత్కారంగా సమాధానం చెప్పి నవ్వింది నర్మద.

నఖశిఖపర్యంతం ఉక్రోషంగా చూశాడు "సిగ్గు లేకపోతేసరి."

"నీకే సిగ్గులేదు నాతో మాట్లాడనని ఒట్టువేసి, సిగ్గులేకుండా నన్ను పలకరించావు" నర్మద వెక్కిరింపు కొరణితో అంది.

"నీకా నాకా సిగ్గులేంది? మళ్ళీ లను ఆ మాట" కోపంగా అరిచాడు కృష్ణ. వీపు వంగదీసి ఒక్కటి ఎలంగా చరిచాడు. "నన్నే అంటావూ? నీకంటె పెద్ద క్లాసు చదువుతున్నవాడిని. హూ.."

చేతి దెబ్బ చవిచూడడంతో లొంగిపోయింది నర్మద. 'ఒరేయ్! ఇంకెప్పుడూ నిన్నేం అనులేరా!"

"నీకు నేను ఒరేయ్‌నా! పేరుపెట్టి పిలవలేవూ?" చెయ్యి పైకెత్తాడు.

"ఏమిట్రా అల్లరి!" అంటూ గందరగోళం విని అక్కడికి వస్తూన్న సుందరమ్మకు ఫిర్యాదు చేసింది నర్మద. "అత్తయ్యా! కృష్ణుడు చూడు"

"కృష్ణా! ఏమిటిది?" పైకెత్తిన చెయ్యి చటుక్కున పట్టుకుంది సుందరమ్మ

ఒకసారి నర్మదవైపు గర్వంగా చూసి, ఫాలతలిమీద నిలిచిన స్వేదం చొక్కాతో తుడుచుకోసాగాడు.

కన్నులలో నిలిచిన నీటిని కనురెప్పల మధ్య అదుముకో ప్రయత్నించింది నర్మద

"ఊరుకో అమ్మా, నర్మదా!" దుఃఖం దాచుకో యత్నిస్తూన్న నర్మద వదన భంగిమ గుర్తించి భుజం చుట్టూ ఆప్యాయంగా చెయ్యివేసి దగిరికి తీసుకుంది సుందరమ్మ.

"ఎందుకురా, కృష్ణా, నర్మదని నెతకదాన్నిజేసి బాదబాదుతున్నావు?" కృష్ణవైపు ముఖంతిప్పి ప్రశ్నించింది సుందరమ్మ.

"ఎందుకా?" నర్మదకేసి తీవ్రంగా చూశాడు 'అసలీ దెబ్బలు చాలవు ఇంక తగలాలి అప్పటికిగాని బుద్ధి రాదు"

"నిన్నేం చేసిందని మరీ అంత కోపం? మా చిట్టితల్లి ఎంతో మంచిదైతేను" నర్మదకేసి లాలనగా చూసింది.

"నా పెన్సిల్ పారేసింది."

"అంతమాత్రానికేనటరా! నీవు ఎన్ని పారెయ్యడం

## గమనిక

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంక్రాంతి ప్రత్యేక సంచిక (19-1-66)లో 8 వ పేజీలో 'రేఖ' చిత్రం రచించినవారు శ్రీ బి. వి. ఎస్. హనుమంతరావు (తణుకు); 9 వ పేజీలో 'తన్మయం' చిత్రం రచించినవారు శ్రీ పి. జనార్దనరావు (డోర్నకల్); 10 వ పేజీలో 'దివ్యమూర్తి' చిత్రం రచించినవారు శ్రీ జి. నాగేశ్వరరావు (హైదరాబాదు); 28 వ పేజీలో 'తొలి అడుగు' చిత్రం రచించినవారు శ్రీ ఎమ్. ఆర్. ఎన్. ప్రసాదరావు (మద్రాసు-17) అని గమనించ కోరుతున్నాము. మొదటి మూడు చిత్రాల విషయంలో చిత్రకారుల పేర్లు ప్రచురించకపోవడం, నాలుగవ చిత్రం రచించినవారి పేరు తప్పుగా ప్రచురించడం పొరపాటు. ఇందుకు చింతిస్తున్నాము.

— ఎడిటర్

## బేల

లేదూ!"

"పెన్సిల్ లేకుండా క్లాస్‌కి వచ్చానని మాస్టారు ఎలా వాచిపోయేలా కొట్టారో తెలుసా నన్ను? మొన్న కూడా అంతే కావాలని పెన్ పట్టుకు వెళ్లి పారేసింది. అప్పుడు నాన్నగారెంత కోపపడ్డారు? పైగా పారేసింది చాలక, ఎందుకు పారేశావని అడిగితే సమాధానం చెప్పకుండా వెక్కిరిస్తుంది." కృష్ణ ఉక్రోషంగా అన్నాడు. "ఆ మాస్టారు ఒకడు నాకు తద్దినంలా 'చదవకపోతే కొట్టండి' అని నాన్న చెబితే ఆయన ఉత్తుత్తినే చావబాదుతున్నాడు."

కృష్ణ చెప్పినదంతా విని నవ్వేసింది సుందరమ్మ. "కృష్ణా! నీ పెళ్ళాంమీద నీ కంత కోపమైతే ఎలారా? అమాయకురాల్నిచేసి ఏడిపిస్తే నీ చేతుల్లో ఇది ఎలా బతుకుతుంది?"

"అందరూ పెళ్ళాం, పెళ్ళాం అంటారు. అసలు నేనేం పెళ్లి చేసుకోను."

"పోనీలే! నీవు చేసుకోకపోతే మా తల్లికి నిన్ను మించినవాణ్ణి తెచ్చి చేస్తాము. మా బంగారు బొమ్మకి ఏం తక్కువ?" నర్మదవైపు చూసింది. నర్మద ఏదో అవగతమైనట్టు సిగ్గుగా శిరస్సు వాల్చేసింది.

"అత్తయ్యా! మరేం అమ్మ ఈ పాలకోవా ముక్కలు ఇచ్చిరమ్మంది." చేతిలో నలిగిపోతూన్న పొట్లం ఇచ్చింది సుందరమ్మకు. "మామయ్యకు ఇష్టంట కదత్తయ్యా. కృష్ణకి కూడా పెట్టేం?"

"నాకేం అక్కర్లేదు." చిమచిమలాడిపోతూ అన్నాడు కృష్ణ.

కనురెప్పలు అల్లల్లాడించి కృష్ణ ముఖంలోకి తమాషాగా చూసింది నర్మద.

"అబ్బ! నీ కెంత కోపంరా. కానీ, నర్మదకి చూడు నీవంటే ఎంత ఇష్టమో!" నర్మద అందించిన పొట్లం అందుకుని వంటగదివైపు వెళ్లిపోయింది సుందరమ్మ. నర్మదవైపు ఒకసారి తిలకించి, అడుగులో అడుగు వేసుకుంటూ అమ్మను అనుసరించాడు కృష్ణ.

వెనకాలే వచ్చి వంటగది గుమ్మంలోనే నిశ్శబ్దంగా నిలబడిపోయిన కృష్ణను చూసి సుందరమ్మ అడిగింది: "ఏమిటి కృష్ణా! పాలకోవా కావాలా?"

"అదికాదే అమ్మా! నర్మద నాకు ఉత్తుత్తి పెళ్ళామా? అసలు పెళ్ళామా?" అమాయికంగా అడుగుతూన్న కృష్ణకేసి చూసి పక్కుమని నవ్వింది. "అసలు పెళ్ళామే! పెద్దఅయ్యాక మాంగళ్యం కడుదువుగాని!"

"అంటే ఏమిటే?"

"అంటే మొన్న సుబ్బులు పెళ్ళప్పుడు సుబ్బులు, పెళ్లికొడుకు ఒకళ్ల కొకళ్ళు పూలదండలు వేసుకోలేదూ? అలాగ పెద్దపందిరి వేస్తాం."

ఏమిటో ఆలోచిస్తూ నేలచూపులు చూస్తున్నాడు కృష్ణ.

"అందుకే పాపం నర్మదని కొట్టకూడదు. ప్రేమగా చూడాలి."

"సరే" అంటూ బుద్ధిగా తల ఊపాడు.

"అమ్మా! పాలకోవా—" నసిగాడు.

"మరి ఇందాకా వద్దన్నావు గదటరా!" నవ్వింది సుందరమ్మ.

"నేను, నర్మద జట్టుగా తింటామే."

పాలకోవా ముక్కలు ప్లేటులో పెట్టి ఇచ్చింది సుందరమ్మ.

పాలకోవా ప్లేటుతో హుషారుగా నర్మద దగ్గిరికి వచ్చాడు కృష్ణ. నర్మద కదలక అక్కడే తలుపుకి చేరగిలబడి ఉంది. వేపచెట్టు కొమ్మమీద రెండు రామచిలకలు అతి చేరువగా నిలబడి సన్నిహితంగా, సరసంగా ఏవో ఊసులాడుకుంటున్నాయి. రెప్పలు కదల్చక తదేక దృష్టితో పరికిస్తూంది.

"నర్మదా! నామీద కోపం వచ్చిందా?" అనునయంగా అడుగుతూ భుజంమీద చెయ్యి వేశాడు. "ఇంకెప్పుడూ నిన్ను కొట్టనుగా! మనిద్దరం జట్టు. పెద్దఅయ్యాక నిన్ను పెళ్లి చేసుకుంటాను."

నర్మద నవ్వి, ముఖం దించివేసుకుంది.

కోవా ముక్క తుంచి నర్మద నోట్లో పెట్టబోయాడు కృష్ణ.

"పో! నాకు సిగ్గేస్తూంది." దోసిట్లో ముఖం దాచుకుంది.

* * *

సాయంత్రం నాలుగయినా సూర్యుడి కిరణ తీవ్రత తగ్గుముఖం పట్టనేలేదు.

చైత్ర మాసపు గాలి విసురు తట్టుకోలేక పక్షిగణాలు చెట్లకొమ్మలలో అణిగి మణిగి ఆగడం తగ్గిం


# పెద్దలకు మాత్రమే!!

దాంపత్య జీవితంలోని బలహీనత గూర్చి మీరు చింతపడవద్దు

## జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేద టానిక్ ఉత్తమ గుణములు కలది. కోల్పోయిన శక్తిని చేకూర్చి మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేయును. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన యౌవనవతులుగా ఉందురు.

**ఎక్కువ ఫలితానికి:**

పాలు వాడుట మంచిది—కావలసినంత దేహవ్యాయామం చేయవలెను—మ్రగుడు వాడరాదు.

**ముఖ్య గమనిక:** జీవనస్పెషల్ మీదేహాన్ని తొందరగా పోషించ శక్తిగలది కాబట్టి మూడు వారములు సేవించిన తర్వాత ఒక వారం రోజులు మానివేయుట చాల అవసరం. లేనియెడల లావై పోదురు. లేక దాంపత్య వాంఛ అధికమగును. **ఆరోగ్యం బలంచేకూరిన వెంటనే మాని వేయవలెను.** 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును. ధర రు. 10/—ప్యాకింగు, పోస్టేజి అదనం

మేము క్రొత్తగా ప్రవేశపెట్టినది:- "అమృతలేపనం"

**"జీవన స్పెషల్"కు** తోడు మిక్కిలి పటువైనది. 25 ఎం. ఎల్. సీసా 1కి రు. 10/—లు నికరం. ఉచిత లిటరేచరుకు వ్రాయండి. సగం విలువ డ్వాన్సుగా ఆర్డర్లతో పంపవలెను. మిగిలినది వి. పి. పి. మీద చెల్లించవలెను. ఆర్డర్లు దిగువ అడ్రసుకు పంపవలెను.

ఉత్తరములన్నియు ఇంగ్లీషులోనే వ్రాయవలెను.

**Manager, Jeevamritham Oushada Sala,**
**CALICUT-1, (S. INDIA)**

**Chief Physician: Dr. K. N. RAMDAS.** **Phone 3607 & 2419**

**షరా:** ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో ముఖ్యమైన అన్ని టౌన్లలో స్టాకిస్టులు కావలెను. షరతు, నిబంధనలకు వ్రాయండి

చాయి.

కృష్ణకు ఏం తోచడంలేదు. అందులోను ఒంటరితనం, నిశ్శబ్దం భరించడం దుర్భరంగా ఉంది. 'ఏం తోచడంలేదు' అని అమ్మతో చెబితే పుస్తకాలు తీసి చదవమంటుంది. లాభం లేదనుకున్నాడు. కిటికీ ఊచలు పట్టుకుని ఏంచేద్దామా అని ఆలోచించసాగాడు. మనస్సులో తీయని ఊహ ఏదో కదిలి నేత్రాలలో గంతులువేసింది. మంచంమీద మత్తుగా నిద్రిస్తూన్న సుందరమ్మవైపు చూసి, అలమారులో ఉన్న దారపు ఉండ తీసుకుని నిక్కరు జేబులో వేసుకున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి, సవ్వడికాకుండా తలుపుతీసి, ఈలవేసుకుంటూ హుషారుగా గతుకుల రోడ్డంట పరుగుతీశాడు.

"నర్మదా! నర్మదా!!" చదువుకుంటూన్న నర్మద నిశ్చలత భగ్నపరిచాడు. నర్మద పుస్తకంలోనుండి తల ఎత్తి చూసింది

సూర్యుడి తీక్ష్ణ కాంతులకు వదనారవిందం వడిలి నల్లబడిపోయింది. అలసటతో నిలబడి స్వేదబిందువులు తుడుచుకుంటూ విశ్రాంతి తీసుకోసాగాడు.

అంతలోనే ఎడ్లకు మేతవేసి వచ్చింది లక్ష్మీదేవి. రొప్పుతూన్న కృష్ణను చూసి సున్నితంగా మందలించింది. "ఇంత ఎండలో ఎందుకు పరుగెత్తావురా! మరీ అంత తొందరేం?"

సమాధానం చెప్పకుండా, నర్మద సమీపాన కూచుంటూ నవ్వాడు.

"ఆడుకుందాం రా, నర్మదా!" లక్ష్మీదేవిని కనుమరుగు కానిచ్చి నర్మద చెవిలో మెల్లిగా ఊదాడు కృష్ణ.

"ఇప్పుడా? ఇంకా ఎండ తగ్గలేదు. నేను రాను. నీవు వెళ్ళి ఆడుకో."

"ఏం?" పిలిచిన వెంటనే వచ్చేసే నర్మద అలా అనడం కృష్ణకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"నేను చదువుకోవాలి." ఒళ్ళో ఉన్న పుస్తకం వైపు దృష్టులు సారించింది.

"అబ్బ! తరవాత చదువుకుందువుగాని లెద్దూ. రాత్రి బోలెడు టైము ఉంది." విసుగ్గా ముఖం పెట్టేసి పుస్తకం లాగేసుకున్నాడు.

"మీకేం కృష్ణా? మీరు గొప్పవాళ్ళు కాబట్టి ప్రైవేట్లు చెప్పించుకుని బాగా చదువుకుంటారు. కాని పేదవాళ్ళం మాకెలా? వీలయినప్పుడల్లా చదవకపోతే మంచి మార్కులు ఎలా వస్తాయి? నీకు పుణ్యం ఉంటుంది. పుస్తకం ఇచ్చేయ్. అమ్మవస్తే కోపపడుతుంది." పుస్తకం అందుకోబోయింది. కానీ కృష్ణ పుస్తకాన్ని రెండుచేతులతో వెనకపెట్టేసుకున్నాడు.

"మీరు పేదవాళ్ళని ఎవరు చెప్పారు?"

"మా అమ్మ."

"మీ అమ్మకేం తెలీదు. మీరుకూడా గొప్పవాళ్ళే. చదివిసరేగాని ముందు నువ్వు రా. నీకోసం వచ్చానిప్పుడు."

"ఎక్కడికి?" కనులు చిత్రంగా అటు ఇటు తిప్పుతూ అడిగింది నర్మద.

"ఎక్కడికైతే నీకెందుకు? రారాదూ? రమ్మంటూంటే ఎదురు ప్రశ్నలు వేస్తావు?"

"ఎక్కడికో చెబితే వస్తాను."

**మమతలు పెంచుకొనడం మనుషులకు సహజం. జన్మ ఇచ్చిన తల్లిని తెలియకుండానే అమ్మా! అని పిలవనిదే నోరు తెరవడం ఎవరికీ చేతకాదు. తల్లి ప్రేమ శ్రీరామరక్షగా పెరిగే పిల్లలు ఉగ్గుపాలతో బాటు మమతలు పెంచుకొంటున్నారు, విస్తృతంగా. కనకనే మనిషిలో పేరుకొన్న విడదీయరాని ఈ మమతలను తెంచే శక్తి తల్లికైనా లేదు.**

"నిజంగానే వస్తావుగా! కాని ఎందుకని అడగకూడదు."

"సరే." నర్మద తల ఊపింది.

"గోపాలస్వామి గుళ్ళోకిపోదాం." శిరస్సు ముందుకు వాల్చి రహస్యం చెబుతున్నట్లు మంద్రగాత్రంతో చెప్పాడు.

"గుళ్ళోకా? ఎందుకు?"

"అదిగో అడగనని అడుగుతున్నావు?"

నవ్వి అంది నర్మద: "సరే, అడగనులే. కానీ ముందు అమ్మని అడుగు. చెప్పకుండా వెడితే తిడుతుంది."

అంతలో అక్కడికి వచ్చింది లక్ష్మీదేవి. గుసగుసలాడుకుంటూన్న ఇరువురిని చూసి చిన్నగా నవ్వుతూ అంది: "ఏమిటిరోయ్ మొగుడూ పెళ్ళాలు ఇద్దరూ మంతనాలు చేస్తున్నారు!"

తల్లిని చూడగానే నోటికి తాళం వేసేసింది నర్మద.

"అబ్బే! ఏం లేదత్తయ్యా!" నసిగాడు కృష్ణ. "అత్తయ్యా! మరే నర్మదని పంపించవా ఆడుకోడానికి?" మెల్లని కంఠంతో అడిగాడు.

"ఇప్పుడేం ఆటలురా! కాస్త ఎండ తగ్గనీ."

"ఎండ తగ్గేటప్పటికి చాలాసేపు పడుతుంది, అత్తయ్యా. అసలు ఇప్పుడే వచ్చేస్తాంగా!" గోముగా అన్నాడు.

లక్ష్మీదేవి నవ్వింది. "సరే, వెళ్ళండి. కానీ ఎండలో పిప్పిగంతులు వేశారంటే ఊరుకునేది లేదు."

లక్ష్మీదేవి అంగీకారం వెలిబుచ్చడంతో కృష్ణ, నిక్కరు జేబు తడుముకుంటూ హుషారుగా లేచాడు. నెమ్మదిగా పుస్తకాలు సర్దుకుని బయలు దేరింది నర్మద. ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ కలిసికట్టుగా సాగిపోతూన్న వాళ్ళను చూస్తూ నిండుగా నవ్వుకుంది లక్ష్మీదేవి.

గోపాలస్వామి ఆలయం దగ్గిరికి తీసుకువెళ్ళాడు కృష్ణ, నర్మదను. దట్టంగా పెరిగిన వృక్షసంతతి నడుమ చైత్రమాసపు ఉష్ణాధిక్యము, మానవుని కుత్సితాలు లేక అతిప్రశాంతంగా, అతి నిర్మానుష్యంగా రమ్యంగా ఉంది ఆలయప్రాంగణం. ఆలయ గోపురంపై పావురాయి జంటలు గూళ్ళలో స్థావరాలు ఏర్పరుచుకుని అప్పుడప్పుడు రెక్కలు టపటప లాడిస్తున్నాయి. నలుదెసలా ఒకసారి తేరిపారచూసి, "ఎవ్వరూ లేరే? ఇప్పుడు ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చావు?" అంది నర్మద.

"ఎందుకంటే"—ఆగి, నర్మద ముఖంలో ముఖం పెట్టాడు. "మనం పెళ్ళి చేసుకుందాం."

"ఛీ! పో!!" ముఖాన్ని వెనక్కు తోసేసింది నర్మద.

## కుమారి తిరుమలసెట్టి సుకన్య

"మనం నిజంగానే చేసుకుందాం, నర్మదా!"

"అమ్మో! ఎవరైనా చూస్తే ఇంకేమన్నా ఉందీ? అమ్మకు తెలిస్తే కొడుతుంది కూడాను."

"ఏం కొట్టదు. మన పెద్దయ్యాక అయినా చేసుకుంటాంగా! ఎందుకు కొడుతుంది?"

ఒక నిమిషం ఆలోచించింది నర్మద. "మరి అయితే ఎలాగ చేసుకోవడం?"

"మునసబుగారి సుబ్బులు పెళ్ళి జరిగినప్పుడు సుబ్బులు, పెళ్ళికొడుకు మల్లెపూల దండలు వేసుకున్నారు. తెలుసా? మనం కూడా పూలదండలు వేసుకుందాం, నర్మదా! ఎంచక్కా బాగుంటుంది."

"బావుంటుంది కాని, మల్లెపూల దండలేవి?" ముఖంమీద పడుతూన్న చెదిరిన జుత్తు వెనక్కు తోసుకుంది.

"మల్లెపూల దండలు లేకపోతేనేం? చేసుకోకూడదా? గన్నేరుపూలు బోలెడు ఉన్నాయి. అవన్నీ కోసి కడదాం. ఇదిగో దారం కూడా తీసుకు వచ్చాను." నిక్కరు జేబులోనుండి భద్రపరచిన దారపు ఉండ తీసి చూపించాడు.

"ఛీ! గన్నేరు పూలేం బావుంటాయి?"

"గన్నేరు పూలకేమమ్మా. పసుపుగా బాగుంటాయి."

"సువాసన ఉండదు. ఏమి ఉండదు. నాకేం ఇష్టం లేదు పో!" మూతి సున్నాలా చుట్టేసింది.

కళ్ళు పైకెత్తి ఒక లిప్తకాలం యోచించాడు కృష్ణ. "పోనీ, పొగడపూలయితే వాసన ఉంటుందిగా, మరి ఏరి గుచ్చుదామా!"

తల ఊపి అంగీకారాన్ని తెలియపరిచింది నర్మద.

సాయంసమయపు బంగారు కాంతులలో ధ్వజస్తంభం తమాషాగా మెరుస్తూంది.

ఇరువురు ఏకమై వరసగా ఉన్న పొగడ చెట్ల దగ్గిరికి నడిచారు. దివాకరుని కిరణాలలో పొగడఆకులు తళతళలాడుతూ విచిత్రానుభూతి కలిగింప జేస్తున్నాయి. మంచి గంధపు మైపూతలా ఆహ్లాదపరుస్తూ తెరలు తెరలుగా చల్లగాలి వీస్తూంది. పొగడ చెట్ల కింద గాలితెరలకు ధరణిని స్పృశించిన శ్వేతవర్ణ పుష్పాలు మంచి ముత్యాలు వెదజల్లినట్లున్నాయి. ఆ పరిసరాలన్నీ పూబాలల సౌరభంతో అలరారుతున్నాయి.

ఇద్దరూ ఏ అడ్డులేక పందాలు వేసుకుని పువ్వులు ఏరారు. కృష్ణ తను ఏరిన పూలన్నీ నర్మద ఒడిలో పోశాడు. ఇద్దరూ పచ్చని ఆకులతో, పూరెమ్మలతో అందంగా ఉన్న నిద్రగన్నేరు చెట్టుకిందికి చేరారు. జేబులో పదిలపరిచిన దారపు ఉండ పైకి తీశాడు కృష్ణ. కావలిసినంత దారం తీసి ఆ దారాన్ని ఇరువైపులా ఇరువురూ పట్టుకుని, పూలుగుచ్చుతూ పూమాల తయారు చెయ్యసాగారు. వాళ్ళిద్దరికి నునులేత రెమ్మలు వింజామర వీవసాగాయి. మామిడిచెట్టుపైనున్న కోకి

అమ్మ మధురిమలు చిందిస్తూ సుతారంగా రాగం తీయసాగింది. దండ గుచ్చడం ఆపి, కోకిల రాగాలాపన వినిపించిన దెసగా తల తిప్పి చెట్టుపైకి చూశాడు కృష్ణ. కుహూ కుహూ ....అంటూ కోకిల కనిపించింది.

"చూశావా, నర్మదా! మనం పెళ్లిచేసుకోవడం కోకిలకి ఇష్టం. అందుకే పాటపడుతూంది."

"కాదు. దీవిస్తూంది." కోకిలవైపు చిత్రంగా చూస్తూ అంది నర్మద.

"అవును. నిజం." చూస్తూండగానే కోకిలమ్మ అదృశ్యమయింది. మళ్లీ తమ కార్యనిర్వహణలో మునిగి ఎలాగైతేనేం పూలదండ పూర్తి కావించారు.

"ఇదిగో, నర్మదా! ముందు ఈ దండ నీ మెళ్లో వేస్తాను. ఆ తరవాత నీ మెడలోనించి తీసి నా మెళ్లో వెయ్యాలి. సరేనా?"

పేచీ పెట్టకుండా అంగీకారం సూచించింది నర్మద.

"అయితే, పద. గుళ్లోకి పోదాం. దేవుడికి దణ్ణం పెట్టి అప్పుడు చేసుకుందాం." ఇద్దరు లేచి నిలబడ్డారు.

"ముందు బావిదగ్గర కాళ్లు కడుక్కుందాం రా. కడుక్కోకపోతే దేవుడికి కోపం వస్తుందిట." బావి దగ్గిర ఉన్న బొక్కెనతో నీళ్లు తోడుకుని పాద ప్రక్షాళనం కావించి గర్భగుడిలో అడుగుపెట్టారు.

పూజారి గోపాలస్వామి సుందర విగ్రహమూర్తికి పూలమాలలు అలంకరించి, నిలబడి ఏవో శ్లోకాలు పఠిస్తూ ధ్యానముద్రలో ఉన్నాడు. వెలిగించిన జ్యోతుల కాంతులలో పరిమళం వెదజల్లే సుమాల మధ్య నిలువెత్తు విగ్రహం బంగారు నగలతో, వినూత్న వస్త్రధారణతో అత్యంత శోభాయమానంగా విరాజిల్లుతూంది. ముందు భక్తితో గోపాలస్వామికి నమస్కారం చేసింది నర్మద.

"చూడు,నర్మదా!దేవుడు ఎంతఅందంగా ఉన్నాడో!" మూలవిరాట్టువైపు కన్నార్పకుండా తిలకిస్తూన్న నర్మదను చూస్తూ అన్నాడు.

"ముందు దేవుడికి దణ్ణంపెట్టు, కృష్ణా!"

నర్మద మాట అమలులో పెట్టాడు. పూదండ

# వేల

భుజంమీద వేసుకుని నర్మద చేరువలో నిలబడి, అవనత నేత్ర అయి నిలబడ్డ ఆమె వదనంకేసి ఒకసారి చూసి, అంజలి ఘటించాడు.

"నర్మదా! ఇదిగో దండ వేయించుకో!" అంటూనే పొగడదండ నర్మద గళసీమలో అలంకరించాడు కృష్ణ. నర్మద తల వాల్చివేసింది.

"ఆ దండ తీసి ఇక నా మెడలో వెయ్యి." తలవంచుకున్న నర్మదను కదిపాడు.

కాని, నర్మద అలాగే నిలబడిపోయింది.

వీళ్ల మాటలు విని ముకుళిత నేత్రాలు విప్పార్చి ఒక క్షణంపాటు పూలదండ దారం నిశితంగా చూసి నవ్వుకున్నాడు పూజారి. నర్మద నిశ్శబ్దంగా ఉండడంతో తనే నర్మద మెడలోనుండి దండతీశాడు. "ఉఁ వెయ్యి." అందివ్వబోయాడు.

"ఉహుఁ." తల ఎత్తి ఒకసారి చూసి చేతులు వెనక్కు పెట్టేసుకుంది.

"ఏం?"

"పూజారి ఇక్కడే ఉన్నాడు. చూస్తున్నాడు." అస్పష్టంగా అంది.

"పర్వాలేదులే. మనకేం భయం?"

"ఉహుఁ." తల అడ్డంగా కదిల్చి వెనక్కు తిరిగి పరుగుపెట్టింది నర్మద. నర్మదను అనుసరించాడు కృష్ణ.

ఒకరివెంట ఒకరు పిక్కబలంకొద్దీ పరిగెత్తుతూ సందులు, మలుపులుదాటి సుందరమ్మ ఇల్లు సమీపించారు. నర్మద చటుక్కున ఇంట్లో దూరి తలుపు సందున నక్కింది.

"ఎవరు?" బియ్యం ఏరుతూన్న సుందరమ్మ, అనసూయతో సంభాషణ ఆపి తల ఎత్తి చూసింది.

మంచంమీద కూర్చుని ఉన్న కరణం, తలుపు సందున ఇరుక్కుపోతూన్న నర్మదను చూస్తూ అన్నాడు:

"ఏమిటమ్మా అల్లరి? నిశ్శబ్దంగా ఆడుకోండి."

"ఎవరు?" సందేహనివృత్తికై వెనక్కు తిరిగి చూసింది అనసూయ. "ఓహో! కృష్ణుడి పెళ్లామా! సరి. ఇక్కడ దాక్కుందేం వచ్చి?" అంది నవ్వుతూ.

మరి కాసేపట్లో బరువుగా రొప్పుతూ వచ్చాడు కృష్ణ.

"అమ్మా! నర్మద వచ్చిందా?"

"వచ్చింది." సుందరమ్మకు బదులుగా సమాధానం చెప్పాడు కరణం.

"ఏదీ?" కలయజూడసాగాడు.

"కృష్ణా ఇటు రా!" దగ్గిరికి పిలిచి పైటకొంగుతో ముఖం తుడిచింది సుందరమ్మ. "ఎందుకు పరిగెత్తావురా అలుపు వచ్చేంతవరకూ? అసలు ఇట్నుంచి చెప్పా పెట్టకుండా ఎక్కడికి వెళ్లావ్?"

కనుబొమలు చిట్లించిన ముఖం పెట్టేశాడు: "ముందు నర్మద ఎక్కడ దాక్కుందో చెప్పమ్మా?"

"ఎందుకోయ్?" గంభీరంగా అడిగాడు కరణం.

"మరేం, మేం గుళ్లో పొగడ పూలదండ గుచ్చుకుని పెళ్లి చేసుకున్నాం."

"పెళ్లా?" ఒక క్షణం ఆశ్చర్యపోయి నవ్వారు ముగ్గురూ.

"పెళ్లి చేసుకోవడం ఏమిట్రా?" అంది సుందరమ్మ నవ్వు ఆపుగుంటూ.

"అవునమ్మా. కాని పూర్తిగా చేసుకోలేదు. నాచేత దండ వేయించుకుని, నాకు దండ వెయ్యమంటే వెయ్యకుండా పూజారి రామన్న చూస్తున్నాడని పరిగెత్తుకు వచ్చిందే!" పూర్తిగా విషయం అంతా అర్థం చేసుకున్న ముగ్గురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని ఒక్కపెట్టున నవ్వారు.

"నీకు అప్పుడే పెళ్లిమీదికి పోయిందిటరా బుద్ధి! ఇంకా కొన్నాళ్లు ఆగు. నీ పెళ్లాం ఎక్కడికీ పోదులే!" కృష్ణ ముఖంలోకి చూస్తూ తలుచుకుని తలుచుకుని నవ్వసాగింది అనసూయ.

"మొత్తానికి ఇద్దరూ కలిసి భలే ఘనకార్యం చేశారే?" గోడకు అంటుకుపోతూన్న నర్మదను చూస్తూ అన్నాడు కరణం నవ్వు ఆపుకుంటూ.

తండ్రి చూపులతోపాటు అవైపే తన చూపులూ మరల్చాడు కృష్ణ. తలుపుసందున చేతుల్లో ముఖం దాచుకుని నర్మద కనిపించింది. "దొంగా! ఇక్కడున్నావా?" చటుక్కున లేచి వెళ్లి నర్మదను ఇవతలికి లాగాడు.

"అబ్బ! వదులు, కృష్ణా!" కృష్ణ చేతుల బిగువు విడిపించుకుని సుందరమ్మ చెంత జేరింది నర్మద. "చూడు, అత్తయ్యా, కృష్ణ నన్ను ఏడిపిస్తున్నాడు." బుంగమూతి పెట్టేసి గారంగా సుందరమ్మకు విన్నవించుకుంది.

నర్మద దగ్గిరికి దుడుకుగా రాబోతూన్న కృష్ణను దగ్గిరికి రానియ్యకుండా దక్షిణహస్తం అడ్డుపెట్టింది సుందరమ్మ. "ఊరుకోరా, కృష్ణా! మరీ నీ అల్లరి ఎక్కువైపోతూంది!"

"కొద్దిగా నలుపయినా లక్ష్మిలాంటి పిల్ల, వదినా! ఏ ఇంటికోడలు అవుతుందో గానీ" అంది అనసూయ నర్మద నునుచెక్కిళ్లకేసి పరీక్షగా వీక్షిస్తూ.

"ఏ పరాయి ఇంటికో ఎందుకు వెడుతుంది



వెలుగు ముందు చీకటి

ఫోటో — మోదిని అప్పారావు (రాజమండ్రి-2)

అమ్మాయిూ! మా ఇంటికే వస్తుంది మాతల్లి. కృష్ణుడికి ఇవ్వకుండా ఎలా ఊరుకుంటాము? చౌదరి ఒప్పుకోకపోయినా బలవంతపెట్టి అయినా మా కోడలుగా చేసుకోవలిసిందే!'' అన్నాడు కరణం పొగాకు చుట్ట చుట్టుకుంటూ.

''అసలు మేం కాదన్నా కృష్ణుడు ఊరుకుంటాడా! ఇప్పుడు మనకు తెలియకుండా పూలదండలు వేసుకున్నారా లేద ?'' ముసి ముసిగా నవ్వేస్తూ నర్మద శిరస్సు మృదువుగా, ప్రేమగా నిమరసాగింది సుందరమ్మ.

''పేద ఇంటి పిల్లని చేసుకుంటారో లేదో అని అనుమానం వచ్చింది, అన్నయ్యా, నాకు. అందుచేత అలా అన్నాను. ఏమి అనుకోకు.'' మంద్ర స్వరంతో అంది అనసూయ.

''డబ్బులో ఏముందమ్మా! నర్మద మనస్సు ఎంత సరళమైనదో స్ఫటికంలా అంత స్వచ్ఛమైనది. అదే చాలు కృష్ణుడి జీవితం ఫలించడానికి.'' పొగాకు చుట్టుకోడం పూర్తిచేసి నిలబడ్డాడు కరణం నవ్వుతూ.

''అయితే నర్మద నిజంగానే అదృష్టవంతురాల్నే మాట.'' చిన్నగా నవ్వి, నర్మద బుగ్గ గిల్లింది అనసూయ.

* * * *

మందపవనం అంచెలు అంచెలుగా వీస్తూంది. కొబ్బరిచెట్టుకింద ఎఱ్ఱని ఎదినార ఏందంతో ఎటో దృక్కులు నిపి నిలువబడ్డ నర్మద వర్తుల నేత్రాలలో విషాదం కదిలుతూంది. ఉభయభానుని తరుణారుణ కిరణాలలో కొబ్బరి పువ్వులు గాలిలో తేలి ఒక్కొక్కటిగా కిందపడుతున్నాయి.

సోల్జర్‌లా బూట్లు టకటకలాడిస్తూ ఉత్సాహంగా వచ్చాడు కృష్ణ. ''నర్మదా! ఇక్కడున్నావా? నీకోసం ఇల్లంతా వెదికాను. తెలుసా?''

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసిన నర్మద లధరాలపై మందహాసం ఒక లిప్తకాలం మెరిసింది. మిఃతవాయని తెల్లని దుస్తులలో ముస్తాబయిన కృష్ణను చూస్తున్నకొద్దీ నర్మద నేత్రాలు సజలాలు కాసాగాయి. ప్రయాణ సన్నాహాల సంబరంలో మునిగి ఉన్న కృష్ణకు, నర్మదలో మూర్తీభవించిన విషాదం చూశాక, సంతోషం, ఉత్సాహం కుంటుపడ్డాయి.

''ఎందుకు, నర్మదా, అలా ఉన్నావూ?''

మౌనందాల్చి ఎడమ హస్తపు వేళ్ళు చూసుకుంటూ ఉండిపోయింది.

''అమ్మ కోప్పడ్డదా? చెప్పు, నర్మదా!''

''ఉ. హూ—''

''మరి?'' భుజంమీద చెయ్యివేసి లాలనగా అడిగాడు.

నర్మద పెదవులు ఆదురుటున్నాయే గానీ స్పందించడం లేదు. ఓ నిమేషకాలం వీక్షించి మెల్లనికంఠంతో అన్నాడు: ''నర్మదా! నేను ఈవేళే హైదరాబాదు వెళ్ళిపోతున్నాను. స్టేషన్‌కి బండి రెడీచేస్తున్నారు. నీకు చెప్పి వెడదామని వచ్చాను.

''పుస్తకాలలో చదువుకున్న హైదరాబాదు చూడబోతున్నానంటే, చదువుకోడానికి వెడుతున్నానంటే నాకెంతో గర్వంగా ఉంది. కాని, నర్మదా, మిమ్మల్ని అందర్నీ వదిలి వెళ్ళాలంటే ఎంతో బాధగాను ఉంది. నిన్ను గురించి తలచుకుంటే అసలు వెళ్ళాలని అనిపించడంలేదు. కాని తప్పదుగదా! మళ్ళీ ఎప్పుడు చూస్తానో నిన్ను.'' కంఠంలో గద్గదిక ధ్వనించింది. ఆ పలుకులు నర్మద గుండెల్లో దుఃఖోద్వేగాన్ని స్పృశించాయి. కన్నులలో బాష్పాలు సాక్షాత్కరించి చెక్కిళ్ళమీదికి ప్రవహించసాగాయి.

''ఛీ! ఏడుస్తున్నావా? తప్పుగదూ!'' ప్రేమగా కన్నీళ్లు తుడిచాడు. ''అంతే ఇందాకటినుండి నేను వెళ్లిపోతున్నాననా అంత అలా బాధగా ఉన్నావు?

''చక్కగా చదువుకోడానికి వెడుతూంటే ఎవరైనా ఏడుస్తారా, నర్మదా, సంతోషంగా పంపిస్తారు గాని? నీవు ఇలా ఏడిస్తే నేను అసలు వెళ్లను. చదువూ అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు నాకు. నీవు ఏడుస్తూంటే నా కెంతో బాధగా ఉంది.''

దుఃఖాన్ని దిగమింగుతూ సరికిణీ కుచ్చెళ్లతో కన్నులు తుడుచుకుంది నర్మద.

బాల్యావస్థలో ఉన్న పచ్చని గరికలు కొత్త సొగసులు వెదజల్లుతున్నాయి.

నర్మద దెస సూటిగా చూస్తూ అన్నాడు కృష్ణ: ''నర్మదా! నేను వెళ్లిపోయినా నీవు నన్ను మరిచిపోవు కదూ! బాగా చదువుకుంటావుగా!''

తలవంచుకుని నిలబడి బొటనవేలితో నేల రాస్తూంది నర్మద.

''సంతోషంగా మాట్లాడి నన్ను ఉత్సాహపరుచు, నర్మదా!'' లాలింపుగా అడిగాడు.

నర్మద లేనినవ్వు తెచ్చుకుని నవ్వింది.

''అంటే నేను చదువుకోవడం నీకు ఇష్టంలేదా? చెప్పు. నీకు ఇష్టంలేకపోతే ఆలాగే మానేస్తాను.''

''అబ్బే! నా కిష్టమే. మానెయ్యవద్దు.''

''మరి అయితే చక్కగా కబుర్లు చెప్పు. మాంచి చదువులు చదివి నిన్ను పెళ్లి చేసుకుంటాను. అప్పుడిక నిన్ను వదిలి ఎక్కడికీ వెళ్లను. సరేనా? అయినా అమ్మా, నాన్నలకి మస్కాకొట్టి సెలవుల్లో వచ్చెయ్యనూ! మామయ్యగారి ఇంట్లో ఉంటానా ఏమిటి?'' ధరణికి అభిముఖంగా ఉన్న నర్మద వదనాన్ని పైకెత్తి నయనాలలోకి సూటిగా చూశాడు.

నర్మద లజ్జాభారంతో నవ్వింది.

గోడమీదనుండి చోద్యంగా చూస్తూన్న కాకమ్మ కావుకావు మంటూ అరవసాగింది. తెల్లని లేగదూడ మెడలో మువ్వలతో ముద్దులొలికిస్తూ గంతులు వేస్తూంది.

* * * *

విరిసీ విరియని జాజులను సుతారంగా ఒక్కొక్కటిగా తుంపుతూ రాగద్వేషాల కతీతురాలై మెల్లిగా అష్టపది పాడుకుంటూంది నర్మద. గళంలో తన్మయత, మాధుర్యము తొణికిసలాడుతున్నాయి.

పక్షిగణాల కలకూజితాలతో, సాయం సమయపు కాంతులతో అందాలు దిద్దుకుంటూంది ఆకాశం.

తెలుపు, ఎరుపు వర్ణాలలో చంద్రకాంతాలు విరిసిన సోయగాన్ని, మబ్బుతుంపరల్లో చూసుకుంటున్నాయి.

కొద్దిదూరంలో తులసికోటమీద చేతుల్లోని పాకెట్ ఉంచి, తులసికోటకు ఆనుకుని, నర్మద వెనకగా నిశ్శబ్దంగా నిలబడ్డాడు కృష్ణ. నర్మద పెదవులు చిందించే జయదేవుని అష్టపది మంద్ర మంద్రంగా కర్ణాలు సోకుతూంది.

నర్మద చామనచాయ శరీరపు యౌవనపు బిగువులో వంపు సొంపులు తేలి తొలివలపు తొలకరింపులు ప్రకాశిస్తున్నాయి.

పాట ఆగిపోయింది.

''అద్భుతంగా ఉంది, నర్మదా!'' కృష్ణ చప్పట్లు కొట్టాడు.

తమకం వీడి తత్తరపాటు చెంది వెనక్కు తిరిగి చూసింది నర్మద. ''మీరా బావా!''

మందస్మితం చేశాడు కృష్ణ: ''పాడడం పూర్తయిందా రాధాదేవీ? మరీ ఎందుకంత పరవశం?''

''పొండి బావా మీరు మరీను. నేను రాధాదేవినేం



రవి అస్తమించే వేళ హుసేన్‌సాగర్ — ఫోటో — కె. ప్రేమరాజ్ (హైదరాబాదు)

కాదు. నర్మదాదేవినే. ఇంతకీ మీరు వచ్చి ఎంత సేపయింది?"

"ఎప్పుడు వస్తే ఏం? నీ పాట అంతా విన్నాను. సరా?"

వదనంలో విరిసిన సిగ్గు నిరులతో ఆమె వదనం రాగరంజితమయింది. "అవునులెండి. బస్తీ దొరవారు దొంగచాటుగా పాటలు వినడం కూడా నేర్చుకున్నారు సుగి."

ఆమె ముఖంలోకి చూస్తూ నవ్వాడు. "అబ్బ! నీ కంఠంలో ఇంతటి మాధుర్యం ఉందని, ఇంత చక్కగా పాడగలవని నాకు ఇంతవరకూ తెలియదు, నర్మదా! నిజం, నీ పాట ఎంత బావుంది! వింటూ నన్ను నేను పూర్తిగా మరిచిపోయాను. నర్మదా, అసలు మనిషిని స్తబ్దుణ్ణి చెయ్యగలిగే ఇంతటి మాధుర్యం నీ కంఠానికి ఎలా అబ్బింది?"

నర్మద పెదవులపై చిరునవ్వు ఎగిరి పడుతూంది.

"అవునులే మరి! వసంత కోకిలకు ఇంపైన గాత్రాన్ని ఎవరిచ్చారు?"

పువ్వులు తుంపడం ఆపి, పక్కున నవ్వేసింది నర్మద.

"ఏం, నర్మదా, అంత అలా నవ్వుతున్నావు?" తమాషాగా చూసి తనూ నవ్వాడు. అంతలో ఏదో గుర్తుకువచ్చి అన్నాడు: "ఓహో! చిన్నప్పుడు 'లంబోదరా' అంటూ నీవు పాడుతూంటే చికాకు పడుతూండే వాణ్ణి ఆపమంటూ. ఆపేదాకా ఊరుకునేవాణ్ణి కూడా కాదు. కానీ ఇప్పుడు అదే కంఠం ఆకర్షణకి లోబడి మెచ్చుకుంటున్నాననిగదూ?"

"ఉహుం—" కాదన్నట్లుగ తలతిప్పేసింది నర్మద.

"మరి?" చిలిపి చూపులతో ప్రశ్నార్థకంగా చూశాడు.

"అయితే బావా, మీకు కాలేజీలో మాటల్లో ముత్యాలు, రత్నాలు కలిపి కుమ్మరించడం కూడా నేర్పిస్తున్నారా?" నవ్వు ఆపుకుంటూ అంది. "అయినా మీరు కవిత్వంలో పడి వైద్యం పూర్తిగా మరచిపోయేలా ఉన్నారు."

"నిజం అంతే. నీ పాటల మైకంలో పడి—"

నవ్వుతూ కృష్ణ మాటలు సగంలో తుంపి వేసింది నర్మద. "ఆఁ ఆఁ ఇక ఆపండి బాబు. పదండి, లోపలికి వెడదాము. వచ్చినప్పటినుండి నిలబడేఉన్నారు."

"మరి ఈ పూలన్నీ కోయవా?" అన్నాడు కృష్ణ పందిరి అంతా కలయజూస్తూ.

మత్తుగా కమ్ముకున్న మంచు భారంతో కలలుకనే వెంత ముకుళిత నేత్రాలలా ఉన్నాయి జాజులు శిరః కంపనం చేస్తూ.

"తరవాత కోస్తానులెండి" అంది తుంచిన జాజులు పూలసజ్జలో వేస్తూ.

"ఎందుకు? ఇద్దరం కలిసి కోద్దాం." తుంచడం మొదలుపెట్టాడు కృష్ణ.

"సరే, అయితే. కోసిపెట్టండి." తల తమాషాగా వంచి కృష్ణదెస పరికిస్తూ అంది నర్మద.

"నాకు జాజులంటే చాలా ఇష్టం. ఎందుకో తెలుసా?"

"ఊఁ హుఁ." కళ్లు చిత్రంగా అటు ఇటు తిప్పుతూ అంది నర్మద.

"ఆమాత్రం తెలియదు నీకు? నీది జాజిలాటి

## వేల

హృదయం కాబట్టి."

"అలాగా! నాకు తెలియదే!" నవ్వింది నర్మద నిండుగా.

"నర్మదా! ఈ జాజుల్ని చూస్తున్నప్పుడల్లా నాకో అనుమానం కలుగుతూ ఉంటుంది. కాని, ఆ అనుమానం విడివడడంలేదు. నీవే విడదీయాలి."

కృష్ణ ముఖంవైపు పరిశీలనగా చూసి అంది నర్మద: "ఏమిటి బావా?"

"ఈ జాజులకి ఉండే ఈ సౌరభం, ముగ్ధత్వం నీ హృదయంనుండి ఇవి కొంత దొంగిలించాయా? లేక నీ హృదయమే ఈ పుష్పాలనుండి దొంగిలించిందా? చెప్పు. నర్మదా!"

"పోదురూ!" సిగ్గుగా కనురెప్పలు బరువుగా వాల్చేసింది నర్మద.

"నిజం! నీ మనస్సు ఎంత కోమలమైనది! అందుకే క్షణం విడిచి ఉండలేకున్నాను నీ పొత్తు." మొగ్గలు ఆమె దోసిట్లో పోస్తూ చిలిపిగా చూశాడు.

"ఇక ఊరుకుందురూ? రామచిలకలా మాటలు బాగా నేర్చారు." హృదయంలోని నవ్వకాంతులు పెదవులపై చిందులాడసాగాయి.

పూలసజ్జ తీసుకుని లోపలికి నడిచింది నర్మద. కృష్ణ తులసికోట మీద ఉంచిన పాకెట్ తీసుకుని ఆమె వెనకే నడిచాడు.

వడిలిన కరవీర, మాలతీ మందారపుష్పాల మధ్య చిన్ని కృష్ణుని పాలరాతి విగ్రహం దీప్తి చెందుతూంది. ఒకసారి ఎత్తుగా ఉన్న దైవమందిరంవైపు చూసి, బూట్లతో ఆ గదిలోకి రాబోతూన్న కృష్ణవైపు చూసింది నర్మద. "బావా! బూట్లతో లోపలికి వస్తున్నారా? ఈ గదిలో మాధవుడు ఉన్నాడు. విప్పేసిరండి."

"పర్వాలేదులే, నర్మదా! దేవుడు పైన ఉన్నాడు గాని కిందకాదుగా!" పాదం గదిలో పెట్టబోయాడు.

"ఉఁ హుఁ—" గుమ్మం దగ్గిరికి వచ్చి అడ్డు నిలిచింది. "ఎంత కాబోయే డాక్టరు అయినా ఇంత పెంకితనం పనికిరాదు మరి. దేవుడు పైన ఉన్నాడో కింద ఉన్నాడో చూపిస్తాను గాని ముందు విప్పండి." కృష్ణ బూట్లు విప్పినంతవరకూ అక్కడే నిలబడ్డది నర్మద.

"ఎలాగైనా నీ పర్యవేక్షణలో చాలా మారేలా ఉన్నాను." గదిలోకి నడిచాడు కృష్ణ.

నర్మద పూలసజ్జ దైవమందిరం చెంత ఉంచింది. "త్వరగా, చెప్పండి బావా, కబుర్లు అన్నీను. మళ్లీ పూజకు వేళ అవుతుంది."

"కబుర్లు ఏం లేవుగాని, ఈ పొట్లంలో ఏముందో చెప్పుకో?" వెనకగా దాచిన పొట్లం చూపించాడు కృష్ణ.

"ఇందాకా మీ చేతుల్లోలేదు. ఇప్పుడు ఎలా వచ్చింది?" అంది కొంచెం ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"అదంతా నా దగ్గిర ఉన్న మంత్రమహిమగాని, ఇదేమిటో చెప్పు చూద్దాం."

నర్మద నవ్వింది. "మీ దగ్గిర ఉన్న ఆ మంత్రశక్తి నా దగ్గిర లేదు మరి. ఎలా కనుక్కునేది?"

"అలాకాదు. చెప్పవలసిందే!"

బుగ్గన చూపుడువేలు ఉంచుకుని ఒక క్షణం ఆ పాకెట్‌వైపు చూసింది: "ఏ చీరో లేకపోతే నన్ను ఏడిపించడానికి పొట్లం కట్టిన ఏ చిత్తు కాగితాలో అయిఉంటాయి."

"నాన్‌సెన్సు, చెత్తకాగితాలా? హైదరాబాదు అంతా గాలించి తెచ్చిన చక్కటి జరీ చీ అయితే." పాకింగ్ విప్పి లేత గులాబీరంగు చీర ఆమె చేతికి ఇచ్చాడు. "గులాబీరంగు నీ శరీరచ్ఛాయకు తగి ఉంటుందని తెచ్చాను. బావుందా?"

నర్మద నవ్వి అంది: "నాకు ఇప్పుడు ఇవన్నీ ఎందుకు బావా! అయినా మీరు నచ్చితే నాకు నచ్చకుండా ఎలా ఉంటుంది?"

"ఉహుఁ అలాకాదు. ముందు నీకు నచ్చిందో లేదో చెప్పు."

"నచ్చకపోవడం ఏమిటి? నాకు తెలుపన్నా, ఈ రంగన్నా అమితమయిన ఇష్టం." మడతలు విప్పి చూసి మళ్లీ మడత పెట్టబోయింది.

"అదేమిటి, నర్మదా, మడిచివేస్తున్నావూ? కట్టుకుని నా కొకసారి చూపించవూ?"

"ఛీ!—"

"పర్వాలేదులే, నర్మదా!" లాలింపు ధోరణిలో అన్నాడు.

"వద్దు బావా! అత్తయ్యావాళ్లకి తెలిస్తే ఏమనుకుంటారు?"

"ఏమీ అనుకోరు." నొక్కిపలికాడు ఆమెవైపు కొంటెగా చూస్తూ. "ఈ చీరతో ఎలా ఉంటావో చూస్తాను, నర్మదా! నేను బయటికి వెళ్లిపోతాలే!"

"వద్దు బావా! నామాట వినండి—" ఇంకేదో

## వేములో తీపి...

**మానేపల్లి సత్యనారాయణ**

### గతం

జ్ఞాపకం వస్తే
గతంకోసం
మనస్సు
కుమిలినా,
గతాన్ని తలుచుకుని
మనస్సు పొందే
అనుభూతి
అనిర్వచనీయం! అపూర్వం!
సమములతూండగా
వేములో తీపివలె,
జీవిస్తున్న కొద్దీ
జీవితంపై
మోహం పెరుగుతుంది! *

అనబోతూన్న నర్మద పెదవులమీద తన దక్షిణహస్తం ఉంచి మాట్లాడనియ్యకుండా చేశాడు.

"వీళ్లిద్దరు ఎప్పుడు చేరారో గాని, మనం ఇంత వరకు గమనించనేలేదు."

పక్కగదిలోనుండి మాటలు వినిపిస్తున్నాయి.

"అవునమ్మా! చాలామంది అడుగుతున్నారు. ఏదో ఒకటి చూసి ఈ సంవత్సరం పెళ్లి చేసెయ్యాలని అనుకుంటున్నాము. ఈడేరిన పిల్లని ఇక ఉంచుకోవడం బావుండదు."

"అయితే మరి కృష్ణుడి విషయం ఏంచేశారు? చిన్నప్పటినుండి అనుకుంటున్నామే! వాణ్ణి చేసు కోడం మీకు ఇష్టంలేదా? ఇష్టంలేకపోతేనేగదా పరాయి సంబంధాలు చూసేది?" కొద్దిగా తీవ్రంగానే ఉంది సుందరమ్మ కంఠం.

"అయ్యయ్యో! ఎంతమాట! అలా అభిప్రాయ పడకు, వదినా! మాకు అలాటి ఉద్దేశాలేం లేవు. అబ్బాయి పట్టణం చదువులు చదువుతున్నాడు గదా! చదువు కున్న అమ్మాయి కావాలంటాడుగాని నర్మదను చేసు కుంటాడా, వదినా!"

"అలాటి శంకలేవీ పెట్టుకోకు. నర్మద చదివిన థర్డ్‌ఫారం చాలు చల్లగా సంసారం చేసుకోడానికి. బి. ఎ.లు, ఎం. ఎ.లు ఎందుకు? చీరలు మార్చడానికి తప్పిస్తే ఎందుకూ పనికిరారు. అయినా వాణ్ణి భరించే శక్తి ఒక్క నర్మదకే ఉందంటారు మీ అన్నయ్య. నిజం అంతేమరి! ఆయనకు, నాకు నర్మదను కోడలుగా చేసుకుని మన అనుబంధాల్ని మరింత సన్ని హితం చేసుకోవాలని ఉంది."

నిండుగా నవ్వింది లక్ష్మీదేవి: "మీ అభీష్టాన్ని కాదన గల శక్తి మాలో ఎక్కడ? మాకుమాత్రం మీతో వియ్యమందాలని లేదూ?"

"విన్నావా, నర్మదా, వాళ్ళ సంభాషణ?"

అరుణిమ దాల్చిన వదనాన్ని వాల్చేసింది.

"మరి నీ అభిప్రాయం?" లాలనగా అడిగాడు.

వాల్చిన కనురెప్పలలో కాటుక గీతల మధ్య సొగసు ఓలలాడుతూంది.

"లాభం లేదమ్మాయ్. ఇలా మౌనంగా ఉంటే నేను ఒప్పుకోను. అయినా ఇలాటి వ్యవహారాలలో గట్టిగానే ఉండాలి." సున్నితంగా చుబుకం పట్టి ముఖం పైకి ఎత్తాడు. నేత్రాలలో ఏవో భావాలు అలవోకగా కదిలించి చెక్కిళ్లు మరలించింది.

"ఉహుఁ....ఇలా కన్నుల మూగభాషలో చెబితే నాకు అర్థంకాదు." నవ్వాడు. "నోటితో చెప్పాల్సిందే."

"ఇష్టమే." ఆ మంద్ర మృదుగాత్రంలో సిగ్గు పిరులు మత్తుగా పరుచుకున్నాయి.

"ఏమిటి ఇష్టం?" ఆమె నేత్రయుగళి దెస చూస్తూ అడిగాడు.

"అబ్బ పోదురూ!" దూరంగా జరిగిపోయింది.

"అలా అని వదిలించుకోవాలంటే వదిలిపెట్టే ఘటాన్నికాను నేను. ఏమిటి ఇష్టమో స్పష్టంగా చెప్ప వలసిందే!"

"పెళ్లి చేసుకోడం?"

"ఎవర్ని?" చిలిపిగా నవ్వాడు.

"మీ....ఉఁహుఁ కాదు, నా కృష్ణ బావని." చిరు కోపాన్ని అభినయిస్తూ ఉరగా చూసింది.

"అరెరే! చాలా పొరపాటు చేశాను, నర్మదా!" వేలు కొరుక్కున్నాడు. "నీవు ఈ పోజులో ఇంత అందంగా ఉంటావని తెలిస్తే కెమేరా తప్పక తెచ్చేవాణ్ణి. అసలు కెమేరా లోడ్ చేసుకుని కూడా అమ్మాయిగారిని గూర్చిన ఆలోచనల పరధ్యానంలో మునిగి మరిచి పోయాను."

"మంచిపని చేశారు." వెక్కిరింపుగా నొక్కి పలికి నవ్వేసింది నర్మద. ముత్యాలు దాచిన ఎర్రకలువ విప్పుకున్నట్టు తోచింది కృష్ణకు.

"అలాగేం?" ఆమె భుజం చుట్టూ చెయ్యి వెయ్య బోయాడు.

"అబ్బ ఎంతాశ!" దూరంగా తొలగిపోయింది.

*   *   *   *

మధుర గత స్మృతుల మధ్య పరుగులు పెట్టిన హృదయం ఆనందాతిరేకంతో పులకరించి వాస్తవం లోకి అడుగుపెట్టింది.

నర్మద అలంకరించుకోవడం పూర్తిచేసి, జడలోని జాజులు సరిజేసుకుంది. అలమారులో ఉన్న అద్దం అందుకుని ముఖం తృప్తిగా చూసుకోసాగింది. పెదవుల మీద ఆశల కాంతులతో వెలుగుతూన్న మందస్మితాన్ని చూసుకుని తనలో తానే సిగ్గుపడిపోయింది. 'మూడు వసంత హేమంతాల అనంతరం బావ వచ్చాడంటే ఈ వేళ కెంతటి సంతోషం!' మరింతగా నవ్వుకుంది. 'ఈ సమయంలో నన్నెవరైనా చూసి ఎందుకా నవ్వు? అని అడిగితే ఏం చెప్పగలను?' తనను తాను ప్రశ్నించు కున్న ప్రశ్నకు ఉప్పెనలా పొంగుతూ వచ్చిన నవ్వే సమాధానం అయింది. 'జీవితాన్నే నిరీక్షణ చేసుకుని యుగయుగాల భారాన్ని అనుభవిస్తూ వలపు వాకిట నిలబడి ఎదురుతెన్నులు చూస్తే ఇన్నాళ్లకు నిరీక్షణ ఫలించి, నా కన్నులలో కాంతులు, గుండెలలో కాంక్షలు, బ్రతుకులో జీవం నిండాయి. అదృష్టవంతురాలిని' అనుకుంది.

'అసలు బావ నన్నుచూసి ఏమనుకుంటాడో గదా! సిటీలో ఎందర్నో ఆడపిల్లల్ని చూసి ఉంటాడు. మరి వాళ్లతో పోల్చి చూసుకుంటే తనకు నేను ఎలా కని పిస్తానో? అసలు బావ ఎంత మారిపోయాడోగదా! డాక్టరైన బావ అల్లరితనం మరిచిపోయే ఉంటాడు. అబ్బ! చిన్నప్పుడు ఎంత పెంకి?'

కిటికీ దగ్గిర నిలబడి అద్దంలోకి చూస్తూ నవ్వు కుంటూన్న నర్మదను చూసి నవ్వుకుంది లక్ష్మీదేవి. సంతోషవిలసితమైన నిండు గుండెలనుండి ఉద యించిన నవ్వది. "నర్మదా! ఇంకా ఎంతసేపు? ఇందా కటినించి ముస్తాబవుతున్నావు?"

"ఆఁ....ఆఁ అయిపోయిందమ్మా!" తన పరాకు తనకేసిగ్గు కలిగించింది. 'తలపులలోనే ఇంత మైమరపా? ఇక బావ సమక్షంలో వీచే వసంత వీచికలలో ఎంత తన్మయురాలనవుతానోగదా!' అద్దం యథాస్థానంలో ఉంచి బయలుదేరింది. ఆమెను చూస్తూన్న లక్ష్మీదేవి వదన కమలం ఏదో భావపరంపరతో ప్రఫుల్లమయింది.

సుందరమ్మ గృహం సమీపిస్తున్నకొలది, మధుర భావనాతరంగాలతో నిబిడీకృతమైన నర్మద ఎడద అదరసాగింది. అదిరే హృదిని అరచేతులతో పట్టుకుని, బెదురుచూపులతో లోపలికి అడుగుపెట్టింది. తన బెదురుకు అదురుకు కారణమైన మనోజ్ఞరూపం వరండాలోనే గోచరించడంతో లజ్జాభారం నేత్రాల లోకి పాకింది.

పూర్తిగా పేపరు చదవడంలో మునిగిపోయి కుర్చీలో జేరగిలబడ్డాడు కృష్ణ. తడబడుతున్న అడుగులతో సమీపించింది. కానీ, పలకరించలేకపోయింది. పలక రిద్దామంటే వణికే అధరాలు సమ్మెచేశాయి. తనరాక వ్యక్తపరుస్తూ చిన్నగా దగ్గుదామంటే అదిరే గుండె కంఠంలో తారట్లాడసాగింది. ఏమీ చెయ్యలేక అలా నిలబడిపోయింది.

పేపరు తిప్పుతూన్న కృష్ణకు మనిషి ఆకారం కని పించడంతో తలఎత్తి చూశాడు. నేలపై చూపులు ఉంచి, స్మితవదనంతో నిలబడ్డ నర్మదను ఒక త్రుటి కాలం నిశితంగా వీక్షించి గుర్తించాడు. "ఓహో! నువ్వా, నర్మదా! వెంటనే గుర్తించలేకపోయాను. ఎంత సేపయింది వచ్చి? వచ్చినదానివి ఉలుకు పలుకు లేకుండా పాలరాతి విగ్రహంలా నిలుచుండిపోయావేం? భలే దానివే!"

# జాలమేల?

## శ్రీకుమార్

**అతి** మనోహరోద్యాన వనాంత సీమ
నవ్య మోహన సందీప్త నయన యుగళి
విమల సుందర చంద్రికల్ వెల్వరించి,
దేవి! నీహృది నన్ను బంధింప నేల?

దవ్వులను నిల్చి చిరునవ్వు పువ్వు లెల్ల
వింట సంధించి నాపైన విసరి విసరి,
చెంతకును జేర వచ్చి నీ వింత లోనె
ప్రియసఖీ! ఆగ్రహమ్ముతో వెడలనేల?

పొంగి యుప్పొంగు నలల మై రంగు లడర
మధుర మోదానుభూతి నెమ్మదికి గూర్చు
ప్రేమ రసపూరి తాబ్ధిలో విడచి నన్ను
సుందరీమణి! పోజాచు తొంద రేల?

నిజ మనోవిపంచిక మ్రోల నెసగి యెసగి
కిన్నరీపతి వోలె మ్రోగించి మించి,
వలపు తేనెల పాటల పలుకరించి
ముగ్ధమోహిని! యిటు మౌన మూన నేల?

నిర్మలముగ నేకాకినై నిలిచి యున్న
నా మనఃఫలకమ్ముపై నాట్య మాడి,
ఆశలను రేపి మేటి యొయ్యార మొదవ
పద్మముఖి! దూర దూరాల వరల నేల?

నవ వసంతరమణి వోలె నన్ను జేరి
హృదయ మను వృక్షమును జిగురింప జేసి,
కుల్కు బెళ్కుల నించి కొంగ్రొత్త రుచుల
సఖియ! వలపుల మురిపింప జాల మేల? *

# తల్లి మనసు

## మానేపల్లి సత్యనారాయణ

**తల్లి** తన పిల్లవాణ్ణి చూసుకుని ఎట్లా ఆలోచనల్లో మునుగుతుందో ఊహించాను.

ఆ కుర్రాడిలో ఎంత స్మృతి కనిపిస్తుంది! తల్లికి పిల్లవాడు ముద్దు కావడానికి ఆ స్మృతి అనేది గొప్పకారణం అనుకుంటాను.

ప్రేమ ముద్ద, జీవంతో మిసమిసలాడే ఆ మూర్తి—తల్లికి ఎంత ఆనందం!

ఆమె మాట్లాడుతుంటే అట్లా చూస్తాడు, నవ్వుతాడు బోసిగా, మౌనంగా—మనసులో ఉన్న నీ ఆలోచనలు నాకు తెలుసులే, అమ్మా అన్నట్టుంటుంది ఆ కుర్రాడి నవ్వు.

పాలకోసం తడుముతున్నప్పుడు తల్లి ఎంత సిగ్గుపడుతుంది!

కుర్రాడు పాలుతాగుతున్నప్పుడు ఆమె ఆనందం, విశ్వాన్ని మరిపించే ఆ దివ్యానుభూతి—పాలుతాగి అలిసి నిద్రపోతాడు, అట్లా ఆమె గుండెల్లోనే.

తన రొమ్ముకు ఒత్తుకుని పడుకున్న ఆ నెత్తురు కండను చూసి ఆమె యోచనల్లోకి మునుగుతుంది. ఆ యోచనల చివర—ఆయన వస్తాడు.

మరీ సిగ్గుతో, పారవశ్యంతో—ముద్దయిపోతుంది ఆమె.

"దేవీ" అంటాడు, ఆమెనుచూస్తూ. స్థితి అర్థం చేసుకుంటాడు. అతని మనసు అప్పుడెట్లా ఉంటుంది? బ్రహ్మకు అంత ఆనందం తెలుసా? నెమ్మదిగా పాపనూ, పాపతల్లినీ చేతుల్లోకి తీసుకుంటే ఆమె అతని వక్షంలో ఇమిడిపోతుంది.

ప్రకృతి అంతా ఆ సన్నివేశానికి తలవంచి సంగీతాన్నాలపిస్తుందనుకుంటాను. *

# వేల

"అబ్బే!...." నసిగింది. ఏం మాట్లాడాలో తెలియక అందంగా, నిశ్శబ్దంగా నవ్వింది. ఎక్కువ ఆనందాన్ని అనుభవిస్తున్న వ్యక్తి హృదయం అవ్యక్తానుభూతులకు లోనయి స్పందించడం మరిచి స్తంభిస్తుందనీ, పెదవులు మాటలు దొరక్క అనురాగహాసాలతో విప్పారుతాయనీ నర్మదకు అప్పుడే అర్థమయింది.

ఆమెను ఒకమారు నఖశిఖపర్యంతం పరిశీలనాత్మక దృక్కులతో అవలోకించి పేపరు మడిచి నవ్వాడు. "అబ్బ! చాలా మారిపోయావే! నా దృష్టిలో వోణీలు వేసుకునే అమ్మాయిగానే ఉండిపోయావు. ఆడపిల్లలు ఇట్టే పెరిగిపోయి గుర్తు పట్టలేనంతగా మారిపోతారులా ఉంది."

ఒక్కసారి తలఎత్తి కృష్ణవైపు చూసి చటుక్కున మళ్లీ తల వాల్చేసింది. 'నేనేనా మారింది? మీరు మారలేదా?' పెదవుల అంచుల చివరకు వచ్చినమాటలు బెరుకుతో మళ్లీ వెనక్కు దొర్లిపోయాయి. నవ్వింది తమాషాగా.

"అదేమిటే, నర్మదా, అలా నిలుచుండి పోయావేం? రా, వచ్చికూర్చో." కుర్చీ చూపించాడు కృష్ణ.

సిగ్గుదొంతరల మధ్య నలుగుతూ బరువైన కనురెప్పలు కదిలించి అలానే నిలుచుండిపోయింది. అడుగు కదల్చలేకపోయింది.

"నర్మదా! మరీ అంత సిగ్గుపడతావేం?" ముసిముసిగా నవ్వాడు. "అయినా ఇంత బెరుకేమిటి? నేనేం కొత్తవాణ్ణికాదుగా!"

పెదవులమీదకు దూకిన చిరునవ్వు కెరటాలు చెక్కిళ్లపైకి ఎగసి అరుణకాంతులు పులిమాయి.

"ఏమిటి పూర్తిగా మౌనం వహించావు? కొంపదీసి నన్నుగాని మరిచిపోయావేమిటి, నర్మదా!" లేచి నిలబడ్డాడు భుజంమీద ఉన్న టవల్‌తో ముఖం తుడుచుకుంటూ.

**"మిమ్మల్ని ఎలా మరిచిపోతాను బావా! విశాఖపట్నపు సముద్రపు అలల చివర వైద్యవృత్తి చేపట్టిన** మిమ్మల్ని ఎలా మరిచిపోగలను? మధురమైన చిలిపి చేష్టలతో బాల్యదశ అత్యంత ఉదాత్తం చేసిన బావగారిని మరవడం సామాన్యులకు సాధ్యమా!"

"ఉఁ హుఁ— అయితే వెనకటి మాటకారితనం ఎక్కడికి పోలేదన్నమాట!"

స్నానం పూర్తికావించి అప్పుడే అక్కడికి వచ్చిన ఎమ్. ఎస్. రావును చూసి ఏదో అనబోయి ఆగిపోయింది నర్మద.

"రావోయ్!" ఎమ్. ఎస్. రావును చూస్తూ చురుగ్గా నవ్వాడు కృష్ణ. నర్మదను పరిచయంచేస్తూ అన్నాడు: "ఈవిడే మా మరదలు, మిస్ నర్మద."

"ఐసి." దక్షిణ హస్తం ముందుకు చాచాడు మిస్టర్ రావు. "గ్లాడ్ టు మీట్ యు." కాని, నర్మద అతని దెస ఓసారి చూసి బరువుగా కనురెప్పలు వాల్చేసింది. మిస్టర్ రావు నర్మదవైపు అదోలా సూటిగా చూసి, చెయ్యి వెనక్కు లాగేసుకున్నాడు. కృష్ణ అదో అమర్యాదగా భావించి నర్మదవైపు తీవ్రంగా చూసి తమాయించుకున్నాడు.

రెండు నిమిషాలవరకు ఎవరు మాట్లాడలేకపోయారు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ కృష్ణ తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో అన్నాడు: "ఇతను ఎవరనుకున్నావు, నర్మదా! ఫారిన్ రిటర్న్‌డ్ ఇంజనీరు. ఎమ్. ఎస్. రావు. నా బెస్ట్‌ఫ్రెండు అని చెప్పాలి. థర్డ్ ఇయర్ చదువుతున్నప్పుడు పరిచయం అయ్యాడు. పల్లెటూళ్ళు తను ఇంతవరకు చూడలేదంటే చూద్దువుగాని రమ్మని తీసుకువచ్చాను."

"ఓహో!" నవ్వింది నర్మద.

ముగ్గురి మధ్యా మళ్లీ నిశ్శబ్దం ఆవరించుకుంది.

కొన్ని క్షణాల అనంతరం ఏమనుకున్నాడో ఏమో మిస్టర్ రావు ముభావంగా అడిగాడు: "మీరేం చదువుకున్నారు?"

నవ్వి సిగ్గుపడుతూనే చెప్పింది: "థర్డ్ ఫారం పాసయ్యాను."

"నర్మదా, వచ్చావా? ఈవేళేకదూ నీ పుట్టిన రోజు? నీ కృష్ణుణ్ణి ఏమని కోరుకున్నావేం?" అంది సుందరమ్మ నర్మద కంఠం విని వచ్చి.

"అయితే ఈవేళ నర్మద పుట్టిన రోజన్నమాట. భేష్—" అన్నాడు బలవంతపు నవ్వుతో కృష్ణ.

"అవునురా! పద్దెనిమిది ఏళ్ల క్రితం సరిగా ఇలాటి సమయానికే పుట్టింది." లోపలికి వెళ్లిపోయింది సుందరమ్మ పనితొందరలో.

"విష్ యూ హేపీ బర్త్‌డే." విష్ చేశాడు మిస్టర్ రావు.

సుందరమ్మ వెనకాలే ద్విగుణీకృతమైన లజ్జతో లోపలికి తుర్రుమంది నర్మద. జడ చివరల బంధింపబడిన జడ గంటలు కుర్చీకి టంగ్‌మని చిరునవ్వడి చేస్తూ కొట్టుకుని ఆమెతోపాటు లోపలికి దూరి మాయమయ్యాయి.

"ఏమిటోయ్! మీ మరదలు మరీ అలా సిగ్గుపడుతూందేమిటి?" అడిగాడు మిస్టర్ రావు.

"ఏమోమరి!" అయిష్టంగా నసిగాడు కృష్ణ.

"ఈ థర్డ్‌ఫారం గ్రాడ్యుయేటును ఇచ్చేనా వీళ్లు నీకు పెళ్లి చెయ్యాలని అనుకుంటూంది?"

"......"

"కృష్ణా! నా అభిప్రాయం చెప్పాలంటే నీకు ఆ అమ్మాయి ఏమాత్రం తగదు. ఇద్దరూ ఉత్తర దక్షిణధ్రువాలు. నీవు ఎంత సోషల్‌గా సరదాగా ఉంటావో, ఆ అమ్మాయి అంత—" ఆగి కృష్ణ ముఖంలోకి చూశాడు. "పైగా నలుపు కూడాను. అదీగాక క్లబ్బులకు, పార్టీలకు రమ్మంటే ఏం వస్తుంది? వచ్చినా నీ పరువు నిలవడం అసాధ్యం. ఇప్పుడు నన్ను పరిచయం చేసినట్టు నీ స్నేహితులను పరిచయం చేస్తే—" కాఫీ గ్లాసులతో నర్మద రావడంతో తెలుగు వాగ్ధాటికి ఫుల్‌స్టాప్ పెట్టి సంభాషణ ఇంగ్లీషులోకి మళ్లించాడు.

కాఫీ గ్లాసులు బల్లమీద ఉంచి లోపలికి వెళ్లిపోయింది నర్మద.

(సశేషం)

# బేల

## కుమారి తిరుమలసెట్టి సుకన్య

### జరిగిన కథ

**కృష్ణుడి పెళ్ళాం నర్మద అని చిన్నప్పటి నుంచి అందరూ అనేవారు. ఆటలలో పెళ్ళి కూడా అయింది. కృష్ణుడు చదువులకు పోయి మూడేళ్ళకు తిరిగివచ్చాడు. నర్మదను చూసి ఆనందించలేక పోయాడు.**

---

(క్రిందటి సంచిక తరువాయి)

రొదగాలి మెల్లగా వీస్తోంది.

గమ్యం చేరుకుంటూన్న కొంగలు అందంగా, బారులు దీరి నీలిమబ్బుల్ని అందుకుంటున్నట్లుగా తమాషాగ ఎగిరిపోతున్నాయి.

నర్మద పొడవయిన జడలో జ్ఞాపకాల బాటలో జాజ్జ్వల్యమానంగా వెలిగే మధుర స్మృతులకు, మమతకు చిహ్నాలుగా రెండు ఎర్ర గులాబీలు మార వాన్ని వెదజల్లుతున్నాయి.

తలుపులు దగ్గిరికి చేరవేసి ఉన్నాయి.

చూపుడు వేలితో తలుపు నెట్టబోయి ఆగి పోయింది నర్మద. లోపలినుండి మంద్రస్వరంతో మాటలు కర్ణేంద్రియాన్ని ముద్దుగా స్పృశిస్తున్నాయి.

"అసలు ముఖ్యంగా ఓ విషయం మాట్లాడాలని వచ్చానండీ! మీరు నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలు వెల్లడి చెయ్యాలని కోరుతున్నాను." వినయం ఉట్టిపడే కంఠంతో అన్నాడు మిస్టర్ రావు.

నవ్వాడు కరణం. "ఏమిటో చెప్పండి?"

"మధ్యవర్తులంటూ వేరే పరదాలు లేకుండా స్వయంగా మీతో సంప్రదించమంటూ నాన్నగారు పంపారు నన్ను." కొద్దిగా ఆగి అన్నాడు: "కృష్ణని మా ఇంటి అల్లుడుగా చేసుకోవాలని నాన్నగారి ప్రగాఢాభిలాష."

"ఏమిటి?" కరణం, కృష్ణ ఒక్కసారిగా ఆశ్చర్య పడ్డారు.

"కృష్ణకి కూడా ఇంతవరకు చెప్పనేలేదు ఈ విషయం." నవ్వాడు మిస్టర్ రావు.

"మా కుటుంబం విషయాలు కృష్ణని అడిగితే తెలుస్తాయి. నేను ప్రత్యేకించి ఏమి చెప్పక్కర్లేదను కుంటాను. నాన్నగారు జిల్లా కలెక్టరుగా పనిచేసి ప్రస్తుతం రిటైరు అయ్యారు. మా చెల్లి ప్రేమ బి. ఎస్‌సి. పాసయింది. కృష్ణకి బాగా తెలుసు కూడాను. ఇదిగో, ఫోటో తీసుకు వచ్చాను. చూడండి."

దడదడలాడే గుండెలతో తలుపు సందులో నుండి లోపలికి చూసింది తను చేసే పని తప్పిదమని తెలిసినా కూడా. నర్మద శరీరం అంతా చల్లబడిపోయింది.

కరణంగారి వదనంలో హాసరేఖలు ద్యోతకం అవుతున్నాయి.

కరణం ముఖంలోకి చూస్తూ అన్నాడు మిస్టర్ రావు: "మరి ఈ రోజుల్లో కట్నాల పాత్ర ముఖ్యమయినది గదండీ! మేము కూడా అమ్మాయిని కట్నం లేనిదే ఎవరికి ఇవ్వ దలచుకోలేదు. అందుచేత కట్నం ముప్పయి వేలు ఇస్తామని చెప్పమన్నారు. అదీగాక నాన్నగారికి చదువు అంటే అమిత ప్రీతి. అందుచేత కృష్ణ అంగీకరిస్తే అమెరికా పంపించాలని ఉద్దేశం. మా బావ కూడా అలాగే ఫారిన్ రిటర్న్‌డ్. ముఖ్యంగా కృష్ణ గుణగణాలు మమ్మల్ని ఎంతో ఆకర్షించాయి. ఇంకేం చెప్పమంటారు? మీకు అంగీకారమైతే నాన్నగారిని పిలిపించి తాంబూలాలు పుచ్చుకోవడమే తరవాయి. బాగా ఆలోచించుకోండి." లేచి వెళ్ళబోయాడు.

"కూర్చోండి. ఎక్కడికి వెడతారు? మీ రింత సన్నిహితంగా మాట్లాడుతూంటే మీ దగ్గిర ఇంకా దాపరికా లేమి ఉంటాయి?" కూర్చోబెట్టాడు కరణం.

"అబ్బాయికి అంగీకారం అయితే మా కిక అయిష్టం ఏమి ఉంటుంది? మీ అంతట మీరు స్వయంగా వచ్చి అడగడం మా కెంతో సంతోషంగా ఉంది."

కరణంగారి ధోరణి, కృష్ణ వరానము సుందరమ్మకు ఏమి నచ్చలేదు. "మరి నర్మద విషయం ఏం చేశారు? వాళ్ళు కృష్ణమీద ఆశతో సంబంధాలన్నీ వదులుకుంటు న్నారు కూడాను."

"ఆ అమ్మాయిని చేసుకుంటానని మీతో ఎప్పుడు చెప్పాను?"

"అదేమిటిరా?" తెల్లబోతూ అంది సుందరమ్మ.

"అవునమ్మా! ఆ అమ్మాయిని చేసుకుని నేనేం సుఖపడలేను. నాకు మారుతూన్న కాలానికి అనుగుణంగా నడిచే చదువుకున్న అమ్మాయి కావాలి. మీ బంధుత్వాల విలువలకు లొంగి నన్ను బాధ పెట్టవద్దు. మొన్న రావుని పరిచయం చేసినప్పుడు షేక్‌హాండ్ ఇవ్వబోతే సిగ్గుతో తలవంచుకుంది. బర్త్ డే విషెస్ తెలియజేస్తే థాంక్స్ అయినా చెప్పకుండా లోపలికి పరిగెత్తింది. మర్యాదలు తెలియని ఈ పల్లెటూరి అమ్మాయిని చేసుకుంటే నేను తలఎత్తి ఎలాగ తిరగడం?"

ఇక ఆగలేకపోయింది నర్మద. అప్పటికే నేత్రాలు జలపూరితాలై పరిసరాలను అస్పష్టం చేశాయి. హృదయంలో భద్రపరుచుకున్న కమ్మని కలలు మనస్సును ఛిన్నా భిన్నం చేశాయి. తడబడే అడుగులతో తొట్రుపడుతూ ఇంటి ముఖం పట్టింది. నవయౌవనంతో సొగసుదీరిన తరుణులలా ముద్దబంతిపూలు అస్తాద్రి చేరుకుంటూన్న భాస్కరుడి కిరణాలలో బంగరు ముద్దల్లా భ్రమ గొల్పుతూ ఊగుతున్నాయి.

*  *  *  *

జాజి పందిరికి చేరువలో మంచం వాల్చుకుని కూర్చుని ఉంది నర్మద. బరువెక్కిన ఆమె మనస్సు ఏదో ఆలోచిస్తోంది.

పందిరి కింద ఉడత ఒకటి చెట్టు చాటునుండి నర్మద వైపు తొంగి తొంగి చూస్తోంది.

"హుఁ—ఒకప్పుడు నర్మదను మించిన వాళ్ళు లేరని గారాలు కురిపించి, మమతలు రేపినవాళ్ళు ఈనాడు చంచలమైన డబ్బు ప్రధానం చేసుకుని నా కూతుర్ని తూలనాడతారా? బతుకు బండలు చేస్తారా!" క్రోధము, గాద్గదికము మిళితమైన కంఠంతో చౌదరి పలుకుతూన్న పలుకులు ఆమెను చైతన్యావస్థ లోకి తెచ్చాయి.

"ఏమిటండీ? ఏం జరిగింది ఇప్పుడు?" ఆత్రము, ఆరాటము పెనవేసుకోగా అడిగింది లక్ష్మీదేవి.

"ఏం జరిగిందా? జరగవలసిందే జరిగింది. ఆశకు పోయి మమకారం పెంచుకున్నందుకు మంచి శాస్తి జరిగింది. కొంప కూలింది."

"మీ రిలా చెబుతూంటే నాకేం అర్థం కావడం లేదు" అంది గాభరాగా.

"నేను చెబితే ఎందుకు అర్థం అవుతుంది? నీ ప్రియమైన అన్నయ్యని అడుగు చెబుతాడు వివరంగా, అర్థమయ్యేలా!"

"ఏమిటండీ? సరిగ్గా చెప్పండీ!"

"మీ అన్నయ్య గారాలపట్టికి ముప్పయివేలతో సంబంధం కుదిరింది. సరా?"

"ఏమిటి? నిజంగా?" నమ్మలేకపోయింది లక్ష్మిదేవి.

ఉద్రేకం తగ్గి కొద్దిగా మెత్తబడ్డాడు. "నీతో అబద్ధాలెందుకు చెబుతాను, లక్ష్మీ? త్వరలో తాంబూలాలు పుచ్చుకోబోతున్నారుట."

ప్రాన్పడిపోయింది లక్ష్మిదేవి. కొద్ది క్షణాల అనంతరం హీనస్వరంతో అంది: "నేను నమ్మలేకుండా ఉన్నానండీ! కృష్ణని భరించే శక్తి ఒక్క నర్మదకే ఉందంటూ ఎన్నో రకాలుగా ఆసక్తి చూపించారు."

"అది అంతా గతజలసేతుబంధనం." చౌదరి కంఠంలో నిష్కారం ధ్వనించింది.

"ఏమోనండీ! అన్నయ్య, వదిన రక్త సంబంధాన్ని అంత తేలిగ్గా వదులుకునే మనుష్యులు కారు. బహుశః వాళ్ళు అనడమే తప్పిస్తే మనం కోరి వెళ్ళి అడగలేదని గాబోలు. తాంబూలాలు పుచ్చుకోలేదుగా! ఒక్కసారి వెళ్ళి అడిగివద్దామండీ!"

"నోరు ముయ్!" చౌదరి కళ్ళలో ఎరుపు జీరలు ప్రస్ఫుటించాయి. "మనం అంత గతిలేని వాళ్ళమేం కాదు. వాళ్ళకంటే తక్కువ అంతస్తు వాళ్ళమని మన మనస్సులతో సరదాగా ఆడుకుని సంతోషించారు. నీవేమో అవన్నీ నిజమని భ్రమ పడ్డావు! నీవేకాదు, నేనూ అలాగే భ్రమించాను."

కళ్ళలో తిరిగిన నీళ్ళు తుడుచుకుని, నోటికి పైట కొంగు అడ్డు పెట్టుకుంది లక్ష్మిదేవి. ఆమె వదనంలోకి చూశాడు. జాలి కలిగింది. "లాభం లేదు, లక్ష్మీ! ప్రెసిడెంటుచేత నాకు చెప్పించాడు, వాళ్ళ అబ్బాయికి సంబంధం కుదిరిందనీ, అబ్బాయి నర్మదను చేసుకోనన్నాడనీ. ఇంకేమిటి? మనం అంతటి ఆత్మాభిమానం లేని వ్యక్తులం కాము, కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకోడానికి. నాకు తెలియకుండా అలాటి పిచ్చి పనులేం చెయ్యకు.

"నీవేం బాధపడకు. వాణ్ణి మించినవాణ్ణి తీసుకు




MTP-I-P-I-65/66

## వేల

వస్తాను. ఎం. ఏ. చదివాడు, మంచి ఉద్యోగముందని అతిగా తాపత్రయపడుతున్నారు చెప్పినా—వాళ్ళకి భ(ద్రయ్యచేత అమ్మాయిని చూడానికి రమ్మని కబురు చేయించాను. ఇప్పుడే వాళ్ళని బస్సు ఎక్కించి వచ్చాను."

"ఎందుకండీ అంత తొందరపడ్డారు?" నీరస స్వరంతో అంది లక్ష్మీదేవి.

ఆ స్థితిలోను నవ్వు వచ్చింది చౌదరికి. "చూస్తే నీలో ఇంకా ఆశ ఉన్నట్టుంది. అలాటిది ఏం పెట్టుకోకు. వాళ్ళు ఒప్పుకున్నా నేను ఒప్పుకోను. నేనేం ఉన్న ఒక్క కూతురికి పెళ్ళి చెయ్యలేని అసమర్థుణ్ణి కాను. ఎలాగైనా వాళ్ళ తాంబూలాలు పుచ్చుకునేలోపల నర్మదకి కూడా నిశ్చయం చేసెయ్యాలి. నా శక్తి సామర్థ్యాలు, పలుకుబడి తెలియజేస్తాను ఆ కరణం గారికి."

ఏదో మాట్లాడబోయింది లక్ష్మీదేవి.

ఆ ప్రయత్నం గుర్తించి అన్నాడు "ఇక నువ్వేం మాట్లాడకు. నాకు ఎదురు చెప్పడానికి వీల్లేదు."

తల్లిదండ్రుల సంభాషణ ఆలకిస్తూ నెమ్మదిగా వచ్చింది నర్మద.

"ఈ విషయాలు నర్మదకి ముందే తెలుసులా ఉందండీ! అందుకే గాబోలు మొన్నటినుండి ఒంట్లో బాగోలేదంటూ తనలో తాను కుమిలిపోతూంది."

"ఏమిటమ్మా! ఘర్షణ పడుతున్నారు?" అంటూ వచ్చింది నర్మద.

"తల్లీ!" నర్మదను చూడడంతో లక్ష్మీదేవికి అణచుకుంటూన్న దుఃఖం పొంగి వచ్చింది. "ఎంతటి అన్యాయం జరిగిపోతూందమ్మా! ఏమండీ! దీని ముఖం చూసి అయినా ఒప్పుకోండి. కాళ్ళావేళ్ళా పడి బతిమాలుకుందాం."

"ఊరుకో, అమ్మా! ఏమిటీ గొడవ? అన్నీ అనుకున్నట్టుగా జరిగితే బతుకెలా సంపూర్ణం అవుతుంది? అసలు నీకు తెలియదమ్మా. పట్నాలలో నాగరికత సన్నాయి నొక్కుల మధ్య జీవితాన్ని గడిపే బావ సాహచర్యం నాకు దుర్భరం. నా వల్ల బావ సుఖపడలేరు. మంచి అమ్మాయిని చేసుకుని బావనైనా సుఖపడనీ!"

"ఇక నీకు సుఖం కూడదా?" కసిగా అన్నాడు చౌదరి. "నర్మదా! నీవేం చింతపడకు. మంచి కుర్రాణ్ణి నా ఇల్లు వాకిలి తెగనమ్మి అయినా చేస్తాను. పిచ్చితల్లీ! ఈ లోకపు తీరే అంత." కనుకొలకులలో కన్నీరు నిల్వగా ప్రేమగా నర్మద శిరస్సు స్పృశించాడు.

నర్మద కళ్ళు మూసుకుని నవ్వుకుంది.

ఆ నవ్వులో ఏదో నిశ్చలమైన నిశ్చయం దీప్తి వెలుగుతూంది.

• • •

"ఇంతకాలంనుండి అన్యోన్యంగా కలిసి, మెలిసి తిరిగి ఈనాడు ఎడమొగం, పెడమొగం అయితే తెలిసిన వాళ్ళందరూ ఏమనుకుంటారు? పట్టింపులకు పోయి, అందరి నోళ్ళలోను నానడం ఎందుకండీ! మన అదృష్టం వల్లో, దురదృష్టం వల్లో మన అమ్మాయిని కాదన్నారు. అయినా డబ్బు అంటే ఎవరికి చేదు?"

పూర్తిగా వినిపించుకోలేదు చౌదరి. "సరేలే!" అంటూ పక్కకు తిరిగాడు.

"అది కాదండీ! ఎలాగూ ఇంత దూరం వచ్చాము. ఆలస్యం ఎందుకని? రేపో మాపో కబురు తెప్పించుకుని బావుకు చేపిస్తే? అమ్మాయిని చూడడానికి పెళ్ళివారు వస్తున్నారు రమ్మంటూ కబురు చేస్తేను వాళ్ళు వచ్చినా రాకపోయినా పెద్దవాళ్ళం కనక తెలియజెయ్యడం మన బాధ్యత" ఆగి, చౌదరి ముఖంలోకి చూసింది లక్ష్మీదేవి.

చౌదరి మౌనంగా పరీ కండువా సరిజేసుకుని భుజం మీద వేసుకున్నాడు.

"అదీగాక ముఖం మీద కొట్టినట్టు అవుతుంది." తిరిగి అంది లక్ష్మీదేవి.

"అఘోరించావులే!" తీక్ష్ణంగా చూశాడు. "ఇప్పుడుగాదు ముఖంమీద కొట్టినట్టు ఉండేది, ముహూర్తాలు పెట్టుకున్నప్పుడు. కొడుకుకు పెళ్ళి చేయబోతూ ఇంతవరకూ తెలియజేశారేమో చూడు. రేపే పేట తాంబూలాలు పుచ్చుకోబోతూంది." కంఠంలో కోపం, బాధ సమంగా ఉన్నాయి.

"వాళ్ళు వచ్చే టైము అయింది. అప్పుడు రాంగామా మొదలుపెట్టక త్వరగా పనులు పూర్తి కానివ్వండి." ఏదో అనబోతూన్న లక్ష్మీదేవిని లక్ష్య పెట్టకుండానే బయటికి నడిచాడు.

ఆకాశం మెల్లిమెల్లిగా మేఘావృతం అవుతూంది.

ఇంటిముందు కారు ఆగడంతో చౌదరి, చిరుదరహాసంతో చరచరా కారు దగ్గిరికి నడిచాడు. కారులో నుండి ముందు భద్రయ్య దిగాడు. భద్రయ్య వెనక మందహాసవదనంతో పట్టు దుస్తుల్లో దిగిన రంగనాధాన్ని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు.

"అబ్బాయి రాలేదే!" మెల్లని స్వరంతో రంగనాధం గారిని, భద్రయ్యను ఇరువురిని ఉద్దేశించి అన్నాడు.

"నిన్న అనుకోకుండా ఇంటర్వ్యూకి మద్రాసు వెళ్ళవలసివచ్చింది" అన్నాడు భద్రయ్య.

"అయినా వాడు నా మాట జవదాటడు. మా కందరికి కుటుంబ సంప్రదాయాలు అవి ముఖ్యం. అందుచేత అమ్మాయిని నేను చూసినా వాడు చూసినా ఒకటే. ఇక అబ్బాయిని అమ్మాయి చూడాలంటే తప్పదనుకోండి వాడు రావడం." కుర్చీలో ఆసీనులవుతూ నవ్వారు రంగనాథంగారు.

పెద్దిసేపు ఏవో కబుర్లు దొర్లిపోయాక నవ్వు మొగంతో అన్నాడు చౌదరి: "ఇక అమ్మాయిని చూస్తారా? మళ్ళీ వర్షం వచ్చేస్తుంది." రంగనాధం గారి సమాధానం కోసం ఎదురుచూడకుండానే గుమ్మం వైపు తల తిప్పాడు. గుమ్మం దగ్గిర తలుపు పక్క నిలబడి లక్ష్మీదేవి రంగనాధంగారిని తదేక దృష్టితో వీక్షిస్తూంది. "ఇదిగో, లక్ష్మీ! అమ్మాయిని తీసుకురా!" చౌదరి పలకరింపుతో దృక్కులు మరల్చి లోపలికి వచ్చింది. సంభాషణ వింటూ జాజిపందిరి దగ్గిర నిలబడ్డ నర్మదకు అమ్మాయిని తీసుకురమ్మన్న తండ్రి పలుకులు వినబడడంతో గుండె కొద్దిగా దడ దడ లాడింది. 'జీవితంలో స్థిర నిర్ణయాలు చేసుకున్న తరవాత ఎందుకు నాకీ భయం? వట్టి పిరికిదాన్ని. ఈ మనుష్యులు నన్నేం చేస్తారు?' తల్లితోబాటు నడిచింది నర్మద.

తెల్లని చీర కట్టుకున్న నర్మదను పరిచి ఉంచిన చాపమీద కూర్చోబెట్టింది లక్ష్మీదేవి. నర్మద మోకాలి పీద చుబుకం ఆనించి, కనురెప్పలు నేలవైపు వాలించింది. బిగుతుగా అల్లిన ఆమె జడలోని జాజులపై అక్కడక్కడ నిలిచి ఉన్న పసుపు కుంకుమలు, అవి భగవదర్పిత సుమాలని తెలియజెపుతున్నాయి.

ఆమె వైపు దృష్టులు ఉంచి దరహాసంతో మృదువుగా అడిగాడు రంగనాధం: "నీ పేరు ఏమిటమ్మా?"

బిడియంతో పెదవులు కదల్చలేక పోయింది నర్మద.

"నీ పేరు అడుగుతున్నారు. చెప్పు. సిగ్గు ఎందుకు?" పక్కింటి ఆవిడ ఒత్తిడి చేసింది.

నెమ్మదిగా పేరు చెప్పింది నర్మద.

"ఏం చదువుకున్నావమ్మా?"

"థర్డ్‌ఫారం చదివి ఆపేశాను."

అంతలోనే కృష్ణ, అతని వెనకాలే మిస్టర్ రావు బూట్ల చప్పుడుతో హడావిడిగా వచ్చారు. ఆ గదిలో తతంగం చూసి ఆశ్చర్యపడ్డా ఆంతర్యం గ్రహించాడు కృష్ణ. వారిరువురి రాక చౌదరికి అయిష్టమే అయినా ఆ తరుణంలో పలకరించక తప్పిందికాదు. "ఏమిటోయ్, కృష్ణా! హఠాత్తుగా వచ్చావు! రండి! కూర్చోండి." తను లేచి ఇద్దరికీ రెండు కుర్చీలు చూపించాడు.

"అబ్బే! వద్దులే, మామయ్యా! తరవాత వస్తాను." వెనక్కు తిరిగి వెళ్ళబోయాడు.

"అదేమిటి, కృష్ణా! ఇలాటి సమయంలో వచ్చి కూడా కూర్చోకుండా వెళ్ళిపోతానంటారు?" అంది లక్ష్మీదేవి. ఇక తప్పదనుకుని వచ్చి కుర్చీలో వాలారు ఇద్దరూ.

ఆ అపరిచిత వ్యక్తుల్ని కళ్ళు పెద్దవి చేసుకుని సులోచనాలలో నుండి పరికిస్తూన్న రంగనాధం వైపు తిరిగాడు చౌదరి. "ఇతను మా మేనల్లుడు కృష్ణ. విశాఖలో డాక్టరుగా పని చేస్తున్నాడు. ఇతను కృష్ణ స్నేహితుడు." పరిచయ వాక్యాలు పలికాడు చౌదరి. పరిశీలనగా కృష్ణ వైపు చూడసాగాడు రంగనాధం. ఒకసారి నర్మదకేసి చూసి చౌదరిని ప్రశ్నించాడు: "అయితే డాక్టరన్నమాట. మరి పెళ్ళి అయిందా?"

సమాధానం చెప్పలేక ఇబ్బందిగా భద్రయ్య ముఖంలోకి చూశాడు చౌదరి.

"ఇంకా అవలేదండీ! ఓ మూడు నాలుగు నెలలుగానే ఉద్యోగం చేస్తూంది" అన్నాడు భద్రయ్య.

నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దంలో అందరి వదనాలను పరిశీలించి అన్నాడు భద్రయ్య: "అమ్మాయి! నర్మదను ఇక తీసుకు వెళ్ళండమ్మా."

లోపలికి వచ్చిన నర్మద, ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని జాజి పందిరి దగ్గరికి నడిచింది. పందిరిపై పసి మొగ్గల మధ్య రెండు విచ్చిన జాజులు తెల్లగా, ఠీవిగా ఊగుతున్నాయి. చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుని, పందిరివైపు చూసింది.

"ఈ జాజులకు ఉండే ఈ సౌరభం, ముగ్ధత్వం నీ హృదయంనుండి ఇవి దొంగిలించాయా? లేక నీ హృదయమే ఈ పుష్పాలనుండి దొంగిలించిందా? చెప్పు, నర్మదా?"

"పోదురూ!" సిగ్గుగా బరువుగా కనురెప్పలు వాల్చేసింది నర్మద.

"నిజం! నీ మనస్సు ఎంత కోమలమైనది? క్షణం ఎడబాయలేకుండా ఉన్నాను నీ పొత్తు." మొగ్గలు ఆమె దోసిట్లో పోస్తూ చిలిపిగా చూశాడు.

కాని క్షణకాలం కన్నులలో కాంతిరేఖలు పులిమిన స్మృతి చెదిరిపోయింది. స్మృతికి చిహ్నంగా నిలిచింది వేడి నిట్టూర్పు. శుష్కహాసం. హేళనచేశాయి రెండు జాజులు.

"ఇక వెళ్ళి వస్తానండీ! త్వరలో తెలియజేస్తాను అన్ని విషయాలు." లోకాభిరామాయణం ముగించి లేచి నిలబడ్డాడు రంగనాథం. అందరూ ఆయన్ను అనుసరించారు.

కారు ఎక్కబోతూ, "భద్రయ్యా! మీరూ రండి, అక్కడి దాకా!" అన్నాడు రంగనాధం.

"అలాగేనండి!" చౌదరి ముఖంలోకి చూసి, కారు ఎక్కి రంగనాధం పక్కనే వెనకసీట్లో కూలబడ్డాడు భద్రయ్య.

కొద్దిగా దుమ్ము రేపుకుంటూ గతుకుల రోడ్డుమీద దూసుకుంటూ వెడుతూన్న కారు మలుపుతిరిగి కనుమరుగు అయ్యే అంతవరకూ చూసి కండువాతో ముఖం తుడుచుకున్నాడు చౌదరి.

"మామయ్యా! నాన్నగారు మిమ్మల్ని రమ్మంటున్నారు." నెమ్మదిగా అన్నాడు కృష్ణ.

"నేనెందుకు?" లోపలికి నడిచాడు చౌదరి.

మిస్టర్ రావును రమ్మంటూ సైగచేసి చౌదరిని అనుసరించాడు కృష్ణ.

"మీ నాన్న గారికి ఇప్పుడు నాతో ఏం పనులున్నాయి?" కంఠంలో దాగని కోపం ప్రతిధ్వనించింది.

"ఆయన మాటలకేం గానీ, ముందు మీరు కూర్చోండి. నిలబడే ఉన్నారు" అంది లక్ష్మీదేవి శాంత



ముద్దు (దారుశిల్పం)

శిల్పి — గిడుతూరి లక్ష్మీనారాయణ (బొంబాయి-73)







## చర్మ శుభ్రతకు

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, కాంతివంతముగాను తయారగును. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, కాంతివంతముగాను చేయుట నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

# బేల

గంభీరస్వరంతో.

"కూర్చో"అంటూ మిస్టర్ రావుకు కుర్చీ చూపించి, "మామయ్యని వెంట బెట్టుకుని తీసుకురమ్మని నాన్న పంపించారు, అత్తయ్యా, మమ్మల్ని"అని కుర్చీలో జేరబడ్డాడు కృష్ణ.

"అన్నయ్య ఎందుకు రమ్మంటున్నాడో ఏమిటో? వెళ్ళిరండి" అంది లక్ష్మీదేవి భర్తవైపు చూస్తూ.

గుండెల్లో రేగుతూన్న సంచలనాన్ని అందుముకుంటూ కండువా తీసి కుర్చీమీద పడవేశాడు చౌదరి. "భద్రయ్యని రానీ. చూద్దాం."

"ఇక చూడ్డంలేదు, గీడ్డం లేదు." దృక్కులు కృష్ణవైపు తిప్పింది లక్ష్మీదేవి. "వస్తారులే, కృష్ణా! ఎంత కాదనుకున్నా రక్తబంధం ఎక్కడికి పోతుంది? ఆ తీపి ఎలా మాసిపోతుంది?"

చేతి వేళ్ళమీద దృష్టులు నిలిపి నిశ్శబ్దంగా ఊరుకున్నాడు కృష్ణ.

ఎవరికి వారు మౌనంతో మనఃఫలకాలమీద భావనా దృశ్యాలు తిలకిస్తూ ఉండిపోయారు.

యౌవనావస్థలో ఏపుగా ఉన్న బాదం చెట్టుపై ఒకటి వెనుకగా మరొకటి రెండు కాకులు ఊపుగా వచ్చి పోట్లాడుకోసాగాయి.

మిస్టర్ రావు ఆ గది పరిశీలన పూర్తిచేసి, సిగరెట్ పీలుస్తూ కొంతసేపు గడిపి, చేతిలో ఉన్న పేపరు మడతలవైపు చూపు మరలించాడు.

అంతలో రానేవచ్చాడు భద్రయ్య.

"వచ్చావా, భద్రయ్యా! నీకోసమే ఎదురు చూస్తున్నాను. రా. కూర్చో!" పెదవులపై చిరునవ్వుతో అన్నాడు చౌదరి.

కృష్ణవైపు అదోలా చూసి కుర్చీలో కూర్చున్నాడు, "అమ్మయ్యా!" అంటూ.

"ఎక్కడిదాకా వెళ్ళావు, భద్రయ్యా?" ప్రశ్నించాడు చౌదరి.

"ఆఁ ఎంతో దూరం వెళ్ళలేదండీ! చెరువు కట్టదాకా వెళ్ళాను. ఈలోపలే ఆయన చెప్పదలచుకున్నవన్నీ చెప్పేశారు. అడగవలసినవన్నీ అడిగారు."

"ఏం చెప్పారు? ఏమడిగారు?" ఆత్రం దాచుకుందుకు ప్రయత్నించాడు చౌదరి. కాని అతని వదనంలోకి ప్రశ్నార్థకంగా, పరిశీలనగా చూశాడు. కాని చౌదరి పరిశీలన వ్యర్థమయింది. పేద ఇంట పుట్టి కాయకష్టాన్ని అనుభవించిన భద్రయ్య శరీర దార్ఢ్యపు వంపులు కొన్ని వదనంలో గంభీరంగా భాసిల్లుతున్నాయి.

సమాధానంగా నవ్వి ఊరుకున్నాడు.

ఆ ధోరణి తిలకిస్తున్న కొద్దీ ఆరాటం ఎక్కువై ఇక ఉండబట్టలేక అడిగాడు మళ్ళీ: "ఏమన్నారో చెప్పు, భద్రయ్యా. మన అమ్మాయిని గూర్చి వాళ్ళకి ఎలాటి అభిప్రాయం ఉంది?"

"అభిప్రాయాల కేంగాని లాంఛనాలు అవీ కాకుండా **పాతికవేలు కట్నం కావాలిట.**"

ఆత్రుతగా చూస్తూన్న లక్ష్మీదేవి వదనం వెంటనే పాలిపోయింది.

భద్రయ్య మాటలు విని మారు మాట్లాడలేక పోయాడు చౌదరి.

"పాతికవేలే!" అప్రయత్నంగానే అనేసింది లక్ష్మీదేవి.

"కట్నం పాతిక వేలు అడుగుతున్నారు. అసలు ఆ అబ్బాయి ఏం చదువుకున్నాడేమిటి?" పేపరు చదువుతూ తల ఎత్తి అన్నాడు మిస్టర్ రావు భద్రయ్యను చూస్తూ.

"ఎం. ఎ. చదివాడు" అన్నాడు భద్రయ్య.

"చచ్చు క్వాలిఫికేషన్! దీనికి పాతికవేలేమిటండీ?"

"అదేమిటి,భద్రయ్యా! మన కుటుంబ ప్రతిష్ఠలు, కట్టుబాట్లు విని మరీ కబురుచేసిన వ్యక్తి ఇంత కట్నం ఎలా అడగ గలిగాడు? చూస్తే ఈయన ఆశయంకూడా కట్నాలు వీలైనంత ఎక్కువగా వసూలు చెయ్యాలని వాబోలు!" అన్నాడు చౌదరి ఎటో చూస్తూ.

"పాతికవేలు ఎక్కణ్ణించి తేగలం?" అంది లక్ష్మీదేవి.

"ఎలాగో అలాగ తల తాకట్టుపెట్టి ఇద్దాంలే. తప్పదు మరి." లక్ష్మీదేవికి చెప్పి భద్రయ్య వైపు చూశాడు. "ఇంకేమన్నారు, భద్రయ్యా?"

సంశయాత్మకంగా చూశాడు భద్రయ్య.

"సంశయం లేకుండా చెప్పు. ఫర్వాలేదు." వృద్ధ స్వరంతో అనునయంగా అన్నాడు చౌదరి.

"కట్నం కంటేను—" ఆగిపోయాడు.

"ఊఁ. కట్నం కంటే—" ఆసక్తిగా ముందుకు వంగాడు.

" 'అమ్మాయి స్కూల్ఫైనలన్నా పూర్తి చెయ్యలేదు. అబ్బాయి ఏమంటాడో? అదీగాక అమ్మాయి నలుపు' అన్నారు."

ముఖంలో విషాదచ్ఛాయలు అస్పష్టంగా కమ్ముకున్నాయి. చిరునవ్వుతో మరుగుపరచ ప్రయత్నించాడు చౌదరి.

"బావుంది. నలుపు తెలుపుల్లో ఏముంది? హృదయ సౌందర్యం ముఖ్యంగానీ! అయినా గోపాలకృష్ణుడు నలుపు కాదూ!" నవ్వాడు మిస్టర్ రావు.

మిస్టర్ రావు మాటలు వింటూ అదోలా నవ్వుకుంది నర్మద. 'స్వవిషయం కానంతవరకూ మనిషి ఎంత చిత్రంగా మాట్లాడుతాడు!'

"ఏదో అడిగారన్నావు? ఏమిటి?"

కంఠం సరిచేసుకుని,దృక్కులు ఎటో నిలిపిన కృష్ణవైపు చూశాడు భద్రయ్య.

అది గుర్తించి అన్నాడు మిస్టర్ రావు: "సరే, మేం వెళ్ళివస్తామండీ! మీరీ సమయంలో ఎలాగూ రాలేరు. అందరూ మాకోసం ఎదురు చూస్తుంటారు. తాంబూలాలు పుచ్చుకునే సమయం సమీపించింది." వాచీ చూసుకుంటూ లేచి నిలబడ్డాడు.

చౌదరి ఏమీ మాట్లాడలేదు.

"రా, కృష్ణా!" అడుగు ముందుకు వేశాడు మిస్టర్ రావు.

మౌనంగా లేచి నిలబడ్డాడు కృష్ణ. "వీలయితే రండి,మామయ్యా!కనీసంఅత్తయ్యనైనా పంపించండి." మెల్లని స్వరంతో పలికి రావు వెనకాలే నడిచాడు.

"ఆఁ. ఏమని ప్రశ్నించాడేమిటి ఆయన?" ఒక క్షణం ఊరుకుని మళ్ళీ అడిగాడు చౌదరి.

" 'ఆ అమ్మాయి అత్తకొడుకు ఉన్నాడు కదా! ఎందుకు చేసుకోలేదు? ఈడు జోడు కూడా బాగుంది'

అన్నారు. పూర్ణంగా మన విషయాలన్నీ చెప్పాను. కానీ, ఆయనేమి మాట్లాడలేదు. పోసి, చౌదరీ, చిన్నప్పటి నుండే అనుకున్నాం. అదీగాక కృష్ణుడులాంటి వాళ్ళు లభించడం కష్టం. సమయం కూడా మించి పోలేదు. వెళ్ళి ఆఖరి యత్నం చేసి వద్దాం పద."

"ఇక ఆపు, భద్రయ్యా! అక్కర్లేదన్న సంబంధమా! ఈ కంఠంలో ప్రాణం ఉండగా ఆ పని చెయ్యను. డిగ్రీ అమ్మాయిమీదికి మనస్సు పోయిన ఆ దౌర్భాగ్యుణ్ణి మా నర్మదకు చేసి, దాని బతుకు దుర్భరం చెయ్యలేను. వాళ్ళు వచ్చి నా కాళ్ళు పట్టుకున్నా ఒప్పుకునేది లేదు." దృఢంగా, క్రోధంగా చౌదరి అంటూన్న ఆ పలుకులు, వెళ్లిపోతూన్న ఇరువురి హృదయాలను స్పృశించాయి.

"కృష్ణా! నీవేం బాధ పడకు ఆయన మాటలకు. ఈర్ష్యకొద్దీ అంటూన్న మాటలవి. నాగరి పట్టడం తప్పిస్తే సభ్యత, సౌప్యత తెలియవు." భుజం చరిచాడు రావు మృదుగళంతో.

నీరసంగా నవ్వాడు కృష్ణ.

• • •

స్నేహితులతో పేకాటలో మునిగిపోయిన పెళ్లికొడుకు కృష్ణ ఉత్సాహాన్ని ఆటంక పరిచింది లక్ష్మీదేవి: "కృష్ణా! నీకు ఈ కవరు ఇవ్వమని పెట్లో పెట్టింది. కానీ ఈ పెళ్లి సందడిలోపడి మరిచిపోయాను. ఇందులో నీ పెళ్లికానుక ఉందిట."

లక్ష్మీదేవి అందించిన కవరు అందుకుని, "మీరు ఆడుకోండోయ్. నిద్రకూడా వస్తూంది" అని పేక ముక్కలు కింద పడవేసి అక్కడనుండి లేచాడు.


'కవర్లో అందించే కానుక ఏమై ఉంటుందబ్బా!' కవరు తెరిచాడు ఉత్సుకతతో. మడతలు మడతలుగా ఉన్న ఆర్టు పేపరు ముందుగా చేతుల్లోకి వచ్చింది. అది ఒక చిత్రం. యమునా తీరంలో ఇసుక తిన్నెల మధ్య అల వోకగా వృక్షస్కంధానికి చేరగిలబడి ఏకాంతంగా, ముగ్ధ సౌందర్యవతి, సౌజన్యవతి రాధాదేవి. ఆమె అర్ధ ముద్రిత విశాలనేత్ర యుగళిలో తేజరిల్లుతూన్న దీర్ఘ నిరీక్షణ. ఇంకేదో తపన. నిరీక్షణలో అలిసిపోయిన అధరాలపై వంపుగా వెలుగుతూన్న దరహాసంతో ఏవో కలల అలలు. మెరిసే ఆశల ఝరులు. మూగవోయిన హృదయానికి ప్రతిరూపంగా చల్లని యమున నీటి వంపుల మధ్య కొద్దిగా ఒరిగిన ముకుళిత రక్తోత్పలం. చూస్తున్న కొలది కృష్ణ చిత్తం ఏదో అనుభూతితో బరువెక్క సాగింది.

'ఆహా! ఎంత భావగర్భితంగా ఉంది! పటిష్ఠమైన భావపరంపర కుంచెతో ఎంత చక్కగా ప్రస్ఫుటింపజేశారు ! ఎవరు వేశారీ చిత్రం? నర్మద దగ్గిరికి ఎలా వచ్చింది?' సందేహ నివృత్తికోసం కన్నులు ఆ చిత్రం నలుదెసలా పరికించాయి. ఓ వైపున సన్నని అక్షరాలతో "కృష్ణ—నర్మద" అని కనిపించింది. కృష్ణ ఆశ్చర్య చకితుడయినాడు. 'ఏమిటి? ఆంధ్రప్రజలను అలరిస్తూ ఆహ్లాద పరుస్తూన్న ప్రముఖ చిత్రకారిణి కృష్ణ, నర్మదా? ఎంత ఆశ్చర్యం! నాకు ఇంత వరకూ తెలియదే! నర్మద నాకెందుకు చెప్పలేదు? థర్డ్‌ఫారం గ్రాడ్యుయేటని, సభ్యత, సంస్కారం ఎరగని పల్లెటూరమ్మాయి అని భావించిన నర్మదేనా? ఆమెలో ఇంతటి అసమాన భావనాశక్తి, చైతన్యము గుప్తమై ఉన్నాయా? మరి పైకి అంత సామాన్యంగా కనిపిస్తుందే!' దృక్కులు కవరు వైపు సారించాడు. ఇంకా ఈ కవరులో ఏమున్నాయో! కాగితం ఒకటి పైకి తీశాడు.

మీగడ తరకల్లా, మంచు బిందువుల్లా అందమైన అక్షరాలు నేత్రోత్సవం చేయసాగాయి. 'ఇదేదో ఉత్తరంలాఉందే!' దృష్టులు అక్షరసముదాయంపై కేంద్రీకరించాడు.

"బావా!

ఇలాటి శుభ తరుణాన మీలో విషాదం నింపి మిమ్మల్ని కొద్దిసేపు స్థాణువును చేస్తూన్న నాస్వార్థాన్ని ముందు మీరు క్షమిస్తారు గదూ? మీ నర్మదని మీరుగాక మరి



ఆగ్రా కోట నుంచి తాజ్ — ఫోటో—కె. రామకృష్ణారావు (చిత్రరంజన్)

ఎవరు మన్నిస్తారు, బావా! ఈ సంతోష సమయాన ఈ లేఖ మీ కందింపజేస్తున్నాను. వివాహ ఘడియల అనుభవంతోపాటు మీ నర్మదని మీరు విస్మృతి స్థానంలో నిలపక మరుపురాని స్మృతిగా మీ అమాయిక హృదయంలో నిలుపుకోవాలనే నా బలీయమైన ఆశ. మీ నర్మద మనఃశాంతికి, తృప్తికి రెండు కవోష్ణ బాష్పాలు విడవాలి. ఇదే నా కాంక్ష.

కృష్ణుడి పెళ్ళాం కృష్ణుడి పెళ్ళాం అంటూ ఈ మనుష్యులందరూ నా లేత గుండెల్లో దృఢమైన ఆకాంక్ష, పవిత్రమైన భావము నెలకొల్పారు. నా హృదయం పోకడ గుర్తించక వేళాకోళాలతో సరసాలాడి, సరదాలు తీర్చుకుని కాలక్షేపం చేశారు. కానీ, నా బావ మరి ఒకరికి అంకితమైపోతానంటే నాలో ఆశలు నింపిన వ్యక్తులే, ఆప్తులే ఇంకొకరితో మీ వివాహానికి అంగీకరించి తగు ప్రోత్సాహం అందించారు. వివాహపు ఏర్పాట్లు ఉత్సాహంతో చేశారు. కాని ఒక్కరు కూడా ఈమెను గురించి ఆలోచించలేదు. చిలిపితనపు చేష్టలతో చిన్ననాడు గోపాలస్వామి సన్నిధిని పొగడపూలతో పరిణయమాడి నాలో రసస్పష్టి నింపిన మీరు కూడా ఆఖరికి, కాలపు పరవడిలో పరుగులు పెడుతూ గతాన్ని సంపూర్ణంగా విస్మరించారు. ఈ మనస్సు, మమత మరిచిపోయారు. కాని, మారుతూన్న కాలం మిమ్మల్ని మార్చగలిగినా నన్ను మార్చలేకపోయింది. అందుచేతే ఆ పొగడదండనే నా మాంగల్యంగా భావిస్తూ జీవంతో ఈ ఒడ్డు చేరాను.

బావా! ప్రకృతిలోని ప్రతి అణువులోను సాక్షాత్కరించే మీ రూపే, చిత్రకళ పట్లగల మీ ఆసక్తే నన్ను ఒక చిత్రకారిణిగా మార్చివేశాయి. కాని, మీకు తెలియజేసేందుకు, మిమ్మల్ని ఆనందింపజేసేందుకు నాకు అవకాశాలు కలగలేదు. ఇది నిజంగా నా దురదృష్టం. ఈ కవరులో ఉన్న చిత్రం మీ నర్మద వేసినది, బావా! 'కృష్ణ' చిత్రకారిణి పత్రికలలో కనిపిస్తూ ఉంటుంది. ఆమెను నేనే! నా హృదయసరసిలో విచ్చిన ప్రణయ పుష్పానికి సాక్ష్యం నా చిత్రాలే! ఇందుకు దోహదమిచ్చి భావోద్రేకాన్ని కలిగించింది మీరు. జీవం మీరు, బావా!

# వేల

ఈ కవరులో ఉన్న చిత్రంలో రాధాదేవిగా నన్ను నేనే చిత్రించుకుని నా తపన, నిరీక్షణ నింపి చాలా కాలం చిత్రించాను. మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తూ దీనిని చూపించి, మీదివ్య సన్నిధిలో వాలిపోవాలని మత్తుగా కలలుగన్నాను. కాని జరుగుతున్నది మరొకటి. చిత్రకళాభిమానులైన మిమ్మల్ని ఈ పేదరాలి చిన్న కానుక, హృదయపుష్పం తప్పక ఆకర్షిస్తుందనే నా భావం. మిమ్మల్ని ఆకర్షిస్తేనే నా కృషికి, నా ప్రేమకు, నా బ్రతుకుకు సార్థకత మరి!

బావా! పెళ్లిసందడిలో మునిగి పవిత్ర మంగళ వాద్యాల మధ్య జీవన సాఫల్యపు తపనతో తలంబ్రాలు పోస్తూ జీవితానికి సరిక్రొత్త బాట నిర్మించుకుంటూన్న మీకు, గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభానికి ఆనుకుని ఉండే నర్మద ఆలాపన వినిపించదు గదూ! కాని పెళ్లి దుస్తులలో నూత్న దంపతులను చిత్రించుకుంటూ, చిత్రణలో సోలిపోయిన నర్మద మిమ్మల్ని దీవించమంటూ మోహనవంశిని ప్రార్థిస్తూనే మృత్యువు పరిష్వంగపు బిగువులోకి జారిపోతూ ఉంటుంది. మరి నర్మద నిర్జీవప్రతిమ ఊహించుకో గలరా, బావా, మీరు! ఒకనాడు మీరందించిన జరీ చీరనే తలంబ్రాలు చీరగా, మన అనుబంధాన్ని పటిష్ఠం చేసే బంధంగా భావిస్తూ, ఆ చీర మడత లలో నా మమకారాన్ని దాచి ఇన్నాళ్లనించి జాగ్రత్త చేసిన ఆ చీరలో, భగవదర్పితమైన జాజిపూల సింగారంతో, కంఠాన నా మాంగల్యమైన పొగడ దండతో సమయానుకూలంగా ప్రవర్తిస్తూ ఆశలు రేపే ఈ మానవమాత్రుల కుత్సితాలకు, కుతంత్రాలకు అతీతురాలై ఉంటుంది మీ నర్మద. కానీ, బావా, ఒక్కటే బాధ. ఆఖరి క్షణంలో మీ పాదాలను స్పృశించే భాగ్యం, అమాయిక స్నిగ్ధవదనాన్ని వీక్షించే అదృష్టం నాకు లేకుండా పోతూందని. కాని బావా! నా సౌభాగ్య మైన మీ చిరునగవుని మాయనీకుండా మీ చేతులతోనే మీ నర్మదని—"

"నర్మదా!" కణకణలాడే నిప్పు పట్టుకున్న పసిపాప యిలా కువ్వగా కూలిపోయాడు కృష్ణ. విలపిస్తూ ఉన్మాదిలా జుట్టు పీక్కుంటూన్న కృష్ణ దగ్గరికి ఆత్రుతగా, వేదనాభారంతో రాసాగింది లక్ష్మీదేవి "ఏం జరిగిం"దంటూ.

"ఏమండీ! మీకు టెలిగ్రాం వచ్చింది"— మిస్టర్ రావు అడ్డుపడ్డాడు.

"ఏమిటి? టెలిగ్రామా? నాకా!" వణికిపో సాగింది లక్ష్మీదేవి.


"మిమ్మల్ని విలుచున్నపాటుగా బయలుదేరి రమ్మంటూ చౌదరిగారు ఇచ్చారండీ!"

"ఎందుకు? ఏం జరిగింది??" కంఠంలో కోటి గుండెల నిండు వ్యథ! కన్నులలో జలపాతం!

"మీ అమ్మాయి—" చెప్పలేక తల వంచుకున్నాడు. అంతలోనే విషాదవార్త అలుముకుని పెళ్లి పందిరి శోకపూరితమయింది.

ఇలాటివెన్నో ఆలకించిన శీతల పవనం విసురుగా వీచ సాగింది.

(సమాప్తం)



బెంగుళూరులోని లాల్‌బాగ్ ఫోటో—రామదాసు (మద్రాసు-18)